PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 161 | విజయవాడ, సోమవారం 15 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 15 January 2024 | Rs



అసైన్డ్ భూములపై త్రిసభ్య కమిటీ

- విస్తీర్ణం హెచ్చు తగ్గుల నిర్ధారణ కోసం నియామకం
- 20లోగా కమిటీకి నివేదించాలి

లోపలి పేజీలో..



భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం

- మోడీపై రాహుల్, ఖర్గే విమర్శలు

లోపలి పేజీలో..



సిఎం క్యాంప్ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు

- గ్రామీణ వాతావరణం ఉట్టి పడేలా ప్రత్యేక సెట్టింగ్స్

లోపలి పేజీలో..

అంగన్‌వాడీలను నిరాశపరిచిన ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు
- ఎస్మా ప్రతుల దగ్ధం

లోపలి పేజీలో..



నేటి నుంచి కేరళలో మెగా సైన్స్ పండుగ

- ప్రారంభించనున్న పినరయి
- వైజ్ఞానిక ప్రయోగాలు, సృజనాత్మక ఆవిష్కరణలు

లోపలి పేజీలో..

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై రేపు తీర్పు

న్యూఢిల్లీ : అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17-ఎ కింద గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా తనపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కొట్టేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ నెల 16న తీర్పు వెలువరించనుంది. ఈ పిటీషన్ విచారణను అక్టోబరు 17న ముగించిన జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం తీర్పు వాయిదా వేసింది. ఈ అంశంతో ముడిపడిన మరో రెండు కేసుల విచారణ (ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ కోసం చంద్రబాబు దాఖలు చేసిన కేసు, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు బెయిల్ ఇస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం వేసిన కేసు) ఈ నెల 17, 19వ తేదీల్లో విచారణకు రానున్నందున సుప్రీంకోర్టు వాటికంటే ముందు 17-ఎపై నిర్ణయాన్ని వెలువరించనుంది. హైకోర్టులో తాను వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

సవరణ

ఈ నెల 14వ తేదీ సంచికలో 'భారీగా బ్యాంకు శాఖల కుదింపు' అన్న శీర్షికన రెండో పేజీలో ప్రచురితమైన కథనంలోని పట్టికలో సెమీ రూరల్‌కు బదులు సెమీ అర్బన్ అని, ఎటిఎంలకు బదులు బిజినెస్ కరస్పాండెంట్లు అని చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిపిఐ ఎంఎల్ నాయకులు పెద్దన్న మృతి

- పలువురి సంతాపం



ప్రజాశక్తి - అనంతపురం

సిపిఐ ఎంఎల్ అనంతపురం జిల్లా కార్యదర్శి పెద్దన్న(76) ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. డిగ్రీ వరకు చదివిన ఆయన వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా చేరారు. 1998లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. తరిమెల నాగిరెడ్డి ప్రభావంతో విద్యార్థి దశ నుంచి ఉద్యమంలో పాల్గొంటూ వచ్చారు. ప్రగతిశీల విద్యార్థి సంఘంలో పనిచేస్తూ యుసిసిఆర్ఐ (ఎంఎల్) పార్టీలో చేరారు. ఈ ఉద్యమాల్లో ఉంటూనే ఎన్‌జిఒ సంఘం నాయకుడు గానూ పనిచేశారు. అనంతరం ఆ పార్టీ సిపిఐ ఎంఎల్‌గా రూపాంతరం చెందడంతో సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శిగానూ, రాష్ట్ర నాయకులుగానూ పనిచేశారు. గత కొంత కాలంగా వయో భారంతో బాధపడు తున్నా.. అంగన్‌వాడీ కార్మికుల సమ్మెలోనూ పాల్గొని మద్దతు తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాళు లర్పించారు

భోగి మంటల్లో ఉపాధ్యాయ వ్యతిరేక జిఓలు

బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం • రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరసనలు



కర్నూలులో ప్రభుత్వ జిఒలను దగ్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, అప్రజాస్వామిక పద్ధతిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం భోగిరోజు నిరసన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ వ్యతిరేక జిఒలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యమాలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భోగి మంటల్లో ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని దగ్ధం చేసే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం, నందిగామ, ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక న్యూస్ క్లిప్పింగ్‌లను, జగ్గయ్యపేటలో ప్రభుత్వ జిఒలను దగ్ధం చేశారు. విస్సన్నపేటలో 'భోగి మంటల్లో ప్రభుత్వ దహనం' కార్యక్రమం చేపట్టారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెవి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం, టెక్కలి, సోంపేట మండలాల్లో ప్రభుత్వ జిఒ ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా విఆర్.పురం, కూనవరంలో భోగి మంటలు వేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ప్రతులను, ఎమ్మిగనూరులో ప్రభుత్వ సమర్థన కరపత్రాలను దగ్ధం చేశారు. ఆదోనిలో భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఉపాధ్యాయ, ఉద్యోగ వ్యతిరేక జిఒ ప్రతులను దగ్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉపాధ్యాయులు నిరసనలు చేపట్టారు. జిఒ 117, పోలీసు నోటీసులు, జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ వాటి ప్రతులను భోగిమంటల్లో వేశారు. ఏలూరు, పశ్చిమగోదావరిలో ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాల పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతపురం, కడప, తిరుపతి, చిత్తూరు, నెల్లూరులో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

'బరి'తెగింపు

- భారీ ఏర్పాట్లతో యథేచ్ఛగా కోడి పందాలు, జూదం
- తాళ్లపూడిలో బౌన్సర్ల ఏర్పాటు
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- అమలుకు నోచని హైకోర్టు ఆదేశాలు



హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న తూర్పు గోదావరి తాళ్లపూడిలోని మలకపల్లిలో బరి వద్ద రక్షణగా ఉన్న బౌన్సర్లు



నందిగామలో పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. నిర్వాహకులు షామియానాలు, కుర్చీలు, ఫ్లడ్ లైట్ల వెలుతురు మధ్య అట్టహాసంగా గుండాట, పేకాట వంటి జూదం కూడా పెద్ద ఎత్తున సాగింది. జాతరను తలపించింది. ఆదివారం కోట్లాది రూపాయలు చేతులు మారాయి. రాష్ట్ర హోం శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. కోడి పందాల వద్ద నిర్వాహకులు బౌన్సర్లను కూడా ఏర్పాటు చేశారు. కోడి పందాలు నిర్వహించకుండా జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోయింది. వీటిని నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. కొన్నిచోట్ల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడితో పోలీసులు ప్రేక్షపాత్ర వహించారు. కోడి పందాలను పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో భారీ స్థాయిలో కోడి పందాలు సాగాయి. భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి-216 పక్కన రెండేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లో కోడి పందాల బరిని ఏర్పాటు చేశారు. పల్లికోనలో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో బరులను ఏర్పాటు చేసి ఒకటి నుండి ఐదు నెంబర్లు కేటాయించారు. ఒకటో నెంబర్ బరిలో లక్ష రూపాయల నుండి ఆ పైన పందాలు, రెండో నెంబర్ బరిలో రూ.50 వేల నుండి లక్ష రూపాయలు, మూడో నెంబర్ బరిలో రూ.20 వేల నుండి 50 వేలు, నాలుగో నెంబర్ బరిలో రూ.5 వేల నుండి రూ.20 వేల వరకు పందాలు కొనసాగుతున్నాయి.

కృష్ణా జిల్లాలో ఆదివారం ఒక్క రోజే రూ.80 కోట్లకు పైగా చేతులు మారినట్లు సమాచారం. మచిలీపట్నం నుంచి మంగినపూడి బీచ్‌కు వెళ్లే రోడ్డు పక్కన మేకవానిపాలెంలో నిర్వహించిన కోడి పందాల శిబిరానికి మచిలీపట్నం, పెడన పరిసర ప్రాంతాలనుంచి వేలాదిగా తరలి వచ్చారు. ప్రాంగణమంతా కారులు, బైక్‌ల పార్కింగ్‌తో నిండిపోయింది.

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు, షేర్ మహమ్మద్ పేట, అనుమంచిపల్లి గ్రామ సమీపంలో కోడి పందాలతో పాటు గుండాట, పేకాట పెద్ద ఎత్తున నిర్వహించారు. సరిహద్దు ప్రాంతంలోని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుండి వచ్చి కోడి పందాలు కాశారు. ఐతవరం మామిడి తోటలో కోడి పందాలను ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్, నందిగామ ఎంఎంసి చైర్మన్ మస్తాన్ ప్రారంభించారు. కోడి పందాల నియంత్రణలో విఫలమైనందుకు నందిగామ ఎసిపి జనార్థన్‌నాయుడును విఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 250కుపైగా బరుల్లో జరిగిన కోడి పందాల్లో ఒక్క రోజే రూ.50 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా. వైసిపి, టిడిపి నాయకులు పోటాపోటీగా కోడి పందాల బరులు ఏర్పాటు చేశారు. కాళ్ల మండలం పెదఅమిరంలో వైసిపి ఆధ్వర్యంలో, సీసలిలోని టిడిపి ఆధ్వర్యాన పందేలు పోటాపోటీగా సాగాయి. నరసాపురం ఎంపి కనుమూరి రఘురామకృష్ణంరాజు భీమవరంలోనూ, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తన సొంతూరు బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులోనూ ప్రారంభించారు. పాలకొల్లు రూరల్ మండలం సగం చెరువు వద్ద ఇరుగ్రూపుల గొడవలో ఒక వ్యక్తిని మరొక వ్యక్తి ఇనుపరాడ్డుతో కొట్టాడని, ఆయన పరిస్థితి విషమంగా ఉందని పందెంరాయుళ్లు చెబుతున్నారు.

కాకినాడలో ఎస్‌పి కార్యాలయానికి కూత వేట దూరంలోని గొడారిగుంట, గైగోలుపాడు కోడి పందాలు జరిగాయి. ఆదివారం ఒక్క రోజే కాకినాడ జిల్లాలో రూ.30 కోట్ల వరకూ చేతులు మారినట్లు సమాచారం. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కాట్రేనికోన, ఆత్రేయపురం, ఉప్పలగుప్తం, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా కోడి పందాలు సాగాయి.

హోం మంత్రి నియోజకవర్గంలోనూ...

రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ప్రాతినిధ్యం వహిస్తోన్న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోనూ కోళ్ళు కత్తి దూశాయి. కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో 23 బరులలో కోడిపందాలు, గుండాట జోరుగా సాగాయి. అధికార పార్టీ సర్పంచులు, ద్వితీయ శ్రేణి నాయకుల కనుసన్నల్లో వీటి నిర్వహణ జరగడంతో అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు చెప్తున్నారు. తాళ్లపూడి మలకపల్లిలో కోడి పందాల వద్ద నిర్వాహకులు బౌన్సర్లను ఏర్పాటు చేశారు.

టివి విలేకరిపై నిర్వాహకుల దాడి

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసరలంకలో భారీగా ఏర్పాటు చేసిన బరిలో కోడి పందాలు నిర్వహించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్టాండ్ ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేశారు. ఈ విషయాన్ని ఓ టివి విలేకరి చిత్రీకరిస్తుండగా నిర్వాహకులు దాడి చేసి ఆయనను గాయపరిచారు.

అసైన్డ్ భూములపై త్రిసభ్య కమిటీ


(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల వారీగా వివరాలు (ఎకరాల్లో)

జిల్లాల పేర్లు	యాజమాన్యపు హక్కు నిర్ధారణ	జిల్లారిజిస్ట్రార్‌కు పంపినవి	బ్యాలెన్స్ జాబితా
1. చిత్తూరు	1,62,611.16	4,254.68	1,58,356.48
2. తిరుపతి	67,461.32	3,057.62	64,403.70
3. అనంతపురం	19,567.23	888.30	18,678.93
4. శ్రీసత్యసాయి	1,92,825.23	1,76,833.17	15,992.07
5. పార్వతీపురం మన్యం	16,114.49	1,485.82	14,628.67
6. అన్నమయ్య	1,35,111.02	1,20,497.53	14,613.49
7. నంద్యాల	23,094.23	8,926.50	14,167.73
8. శ్రీకాకుళం	8,556.04	4,067.27	4,488.77
9. అల్లూరి సీతారామరాజు	21,339.45	17,366.43	3,973.02
10. వైఎస్ఆర్	15,826.75	12,682.15	3,144.60
11. ప్రకాశం	4,006.74	1,289.54	2,717.20
12. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	46784.8075	44,516.14	2,268.67
13. బాపట్ల	2,025.99	265.83	1,760.16
14. విజయనగరం	6,646.48	5,387.39	1,259.09
15. ఏలూరు	11,789.09	11,287.28	501.81
16. కాకినాడ	6,7433.82	6,384.26	359.36
17. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ	340.95	35.11	305.84
18. విశాఖపట్టణం	634.95	34438	290.57
19. ఎన్‌టిఆర్	4,749.27	4,715.68	33.59
20. గుంటూరు	78.99	76.37	2.62
21. పల్నాడు	3,175.71	3,175.71	0.00
22. కర్నూలు	4,603.96	4,654.85	0.00
23. కృష్ణ	686.82	814.42	0.00
24. పశ్చిమ గోదావరి	249.10	1,206.25	0.00
25. తూర్పు గోదావరి	837.90	1,964.43	0.00
26. అనకాపల్లి	5,129.29	6,316.79	0.00
మొత్తం:	**7,60,990.57**	**4,42,493.89**	**3,21,946.34**

అమలు కాని పర్మినెంట్ హామీ

- 37 నెలలుగా అటవీ కార్మికుల రిలే దీక్షలు
- మానసిక క్షోభతో మూడేళ్లలో 12 మంది మృతి
- నిమ్మకునీరెత్తినట్లుగా టిటిడి, ప్రభుత్వం



మానసిక క్షోభతో ఇటీవల మృతి చెందిన బత్తిరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టిటిడి అటవీ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని వారు కోరుతున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో 37 నెలలకుపైగా తిరుపతిలో రిలే దీక్షలు చేస్తున్నారు. ధర్మాన్ని రక్షించాల్సిన టిటిడి వీరి విషయంలో అధర్మంగా వ్యవహరిస్తోంది. కార్మికుల మధ్య చిచ్చు పెట్టి 159 మంది జూనియర్లను రెగ్యులర్ చేసింది. మిగిలిన 203 మంది పట్ల వివక్ష పాటిస్తోంది. 25 ఏళ్లుగా శ్రీవారినే నమ్ముకుని ఎప్పటికైనా రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఉన్న వీరికి నిరాశే ఎదురవు తోంది. రిలే దీక్ష ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకూ 12 మంది తీవ్ర మనస్తాపంతో మృతి చెందారు. అయినా, ప్రభుత్వంలోగానీ, టిటిడిలోగానీ స్పందన లేదు.

టిటిడిలో 25 సంవత్సరాల నుంచి 362 మంది అటవీ కార్మికులుగా పనిచేస్తున్నారు. శేషాచలం అడవులను పచ్చ దనం పరిచేలా పెంచి పోషించడం, గార్డెన్లను కాపాడడం, పూల మొక్కలు నాటడం వంటి విధులు వీరు నిర్వహిస్తు న్నారు. స్మార్ట్‌సిటీ అయిన తిరుపతిలో డివైడర్లలోనూ అంద మైన పూలమొక్కలు పెంచుతూ సుందరీకరణకు తోడ్పడు తున్నారు. పర్మినెంట్ చేయాలని, తమ సమస్యలు పరిష్క రించాలని కోరుతూ అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఆందోళనలు నిర్వహించారు. 2019లో పాదయాత్ర ముగించుకుని ప్రతిపక్ష నేతగా తిరుమలకు వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి తమ సమస్యలను విన్నవించారు. వీటిపై ఆయన స్పందిస్తూ, తాను అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో అటవీ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత టిటిడి బోర్డులోనూ ఇందుకు అనుకూలంగా తీర్మానం జరిగింది. హామీ అమలు కాకపోవడంతో అటవీ కార్మికులు 2020 నవంబర్ 26 నుంచి రిలే దీక్షలకు దిగారు.

వైఎస్ఆర్‌సిపి ట్రేడ్ యూనియన్‌లో చేరిన వారికే పర్మినెంట్

'విభజించు... పాలించు' విధానానికి వైసిపి తెరలేపింది. తమ యూనియన్‌లోకి వస్తే పర్మినెంట్ చేస్తామని వైఎస్ఆర్‌సిపి ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి టిటిడి అటవీ కార్మికులను ఆశ పెట్టారు. యూనియన్లో చేరిన 159 మందిని జూనియర్లు అయి నప్పటికీ టిటిడి పర్మినెంట్ చేసింది. వారికి రూ.32,600 చొప్పున వేతనం చెల్లిస్తోంది. లబ్ధి కార్డు, ఉచిత బస్‌పాస్ ఇస్తోంది. సీనియర్లను మాత్రం కక్షసాధింపు చర్యల్లో భాగంగా పర్మినెంట్ చేయలేదు. టిటిడి ఏర్పాటు చేసిన లక్ష్మీశ్రీనివాస్ మేన్‌పవర్ కార్పొరేషన్లో చేర్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా, వారికి రూ.13,334 వేతనం మాత్రమే చెల్లిస్తోంది. తమను రెగ్యులర్ చేయాలని టిటిడి డిఎఫ్ఒ కార్యాలయం ఎదుట అటవీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు భోగి పండగ పూట కూడా కొనసాగాయి. న్యాయపోరాటం కూడా సాగిస్తున్నారు. పర్మినెంట్‌కు నోచుకోకపోవడంతో మనస్తాపంతో క్షోభకు గురై ఇప్పటి వరకూ 12 మంది కార్మికులు మృతి చెందారు. వారిలో గత మంగళవారం తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతి చెందిన బత్తిరెడ్డి (55) ఉన్నారు. గతంలో సి.మునిరత్నం, బి.వెంకటరత్నం, పి.రామ చంద్రయ్య, డి.పద్మనాభయ్య, మరో ఏడుగురు చనిపోయా రు. పర్మినెంట్ కాకపోవడంతో టిటిడి నుంచి ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో వీరి కుటుంబాలు వీధిన పడ్డాయి.

అందరినీ పర్మినెంట్ చేయాలి
కందారపు మురళి, సిఐటియు



పర్మినెంట్ చేయాలని, ఇతర న్యాయమైన సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ మూడేళ్లకుపైగా అటవీ కార్మికులు రిలే దీక్షలు చేస్తు న్నా టిటిడి చోద్యం చూస్తోంది. తమ బతుకులు ఏమై పోతాయనే మనస్తాపంతో ఇప్పటికే 12మంది మృతి చెందారు. టిటిడి చైర్మన్ వెంటనే స్పందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలి. అటవీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కాపాడాలి.

కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం

ప్రభుత్వాలే నిర్వహించాలి

- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు శ్రీనివాసరావు
- కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు ప్రచారం నిర్వహించాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఆధ్వర్యాన ముద్రించిన 2024 డైరీని విజయవాడలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులకు ఉన్న రక్షణ చట్టాలు కాలరాయబడుతున్నాయని, వారికి రక్షణ, భద్రత కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మనువాద మతోన్మాదుల పాలనలో దళిత, ఆదివాసీ మహిళలపై పెద్దఎత్తున దారుణమైన కులదురహంకార దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో పాలక పార్టీలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దాయిలను కాపాడటంలో, వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. దళిత, గిరిజనులపై జరుగుతున్న నేరాల్లో తెలుగు రాష్ట్రాలు కూడా బిజెపి పాలిత రాష్ట్రాల చెంత చేరాయని జాతీయ నేర పరిశోధన సంస్థ లెక్కల్లో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో సామాజిక సాధికారత యాత్రలు జరుగుతున్న సమయంలోనే చాలాచోట్ల కులదురహంకార దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయని తెలిపారు. దళితుడిని హత్యచేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతబాబును పక్కన కూర్చోబెట్టుకుని పాలకులు సామాజిక న్యాయం గురించి పదేపదే ఉపన్యాసాలు ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరగడం సంతోషమేనని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తి ఉండాలంటే కులవ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ప్రభుత్వం నాయకత్వం వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. అప్పుడే అంబేద్కర్ కలలు కన్న కుల నిర్మూలన నెరవేరుతుందన్నారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ చట్టం తెస్తానని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. దళితుల చట్టాల అమలుకోసం పోరాడుతూ అసమానతలు లేని అభివృద్ధికరమైన సమాజ మార్పుకోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు జి నటరాజు, సహాయ కార్యదర్శి జి క్రాంతికుమార్, నాయకులు చింతల శ్రీనివాస్, రారాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం ఒంటెద్దు పోకడ

- వైఎస్ఆర్‌టియుసి

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రజా, కార్మిక, శ్రామిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడగా పరిపాలన సాగిస్తోందని వైఎస్ఆర్‌టియుసి స్టీల్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 1067వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరంలో వైఎస్ఆర్‌టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి మస్తానప్ప మాట్లాడుతూ.. జాతీయ సంపద అయిన ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం పౌరులుగా ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు కార్మికులకు తక్షణమే నూతన పేస్కేల్స్ అమలు చేయాలని, అన్ని విభాగాల్లో మేన్‌పవర్ పెంచాలని, మెరుగైన వైద్యం అందించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, యు.రామస్వామి, కెఎస్ఎన్.రావు, వరసాల శ్రీనివాసరావు, పిట్టారెడ్డి, గెద్దాడ అప్పలకొండ, పిట్ట సంజీవరెడ్డి, డివి.రమణారెడ్డి, గొందేశీ మంగరాజు, కిషోర్, కె.నూకరాజు, పి.శంకరరావు, జివిఎన్.మూర్తి, ఎస్.ఈశ్వర రావు, టి.లక్ష్మణరావు, టి.నాగరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి కౌంట్‌డౌన్ మొదలైంది

- భోగి వేడుకల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా), అమరావతి బ్యూరో

'ఎన్నికలకు కేవలం 87 రోజులే గడువు ఉంది. వైసిపి దుష్టపాలనకు అమరావతి నుంచే కౌంట్‌డౌన్ మొదలైంది' అని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అన్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి వేడుకలు మందడంలోనే జరుపుకుంటామని చెప్పారు. రాజధాని ప్రాంతం మందడంలోని గోల్డెన్ రూల్ స్కూల్ ఆవరణలో ఆదివారం 'తెలుగు జాతికి స్వర్ణయుగం-సంక్రాంతి సంకల్పం' పేరుతో జరిగిన భోగి మంటల కార్యక్రమంలో చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అమరావతి రాజధాని వ్యతిరేక ఉత్తర్వుల ప్రతులను భోగి మంటల్లో వేశారు. సంప్రదాయ దుస్తులు పంచె కట్టుకొని చంద్రబాబు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల తర్వాత టిడిపి-జనసేన పార్టీ పొత్తుతో అమరావతే రాజధానిగా పాలన సాగనుందన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగం వృథా కావని, ఏ ఉద్దేశంతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చారో ఆ ఉద్దేశం నెరవేరనుందని పేర్కొన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వగా ఇంకా 8 వేల నుంచి పది వేల ఎకరాల భూములు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటిని అమ్మితే సుమారు రూ.మూడు లక్షల కోట్ల సంపద సమకూరేదని తెలిపారు. వైసిపి పాలనలో భవన నిర్మాణ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత ఇలా.... ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ తీరు మారాలన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలకు చీకటి తప్ప వెలుగు లేదని విమర్శించారు. అంగన్‌వాడీలు 34 రోజులుగా సమ్మె చేస్తూ రోడ్లపై ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 466 మండలాల్లో కరువు ఉంటే 106 మండలాల్లోనే ఉందని చెప్పి కేంద్ర సాయం కూడా తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో పండుగ కూడా సరిగా జరుపుకోలేని పరిస్థితిలో పేదలు ఉన్నారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి పూర్వ వైభవం తీసుకొస్తామని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర పాలన కోసం టిడిపి, జనసేన పార్టీ కృషి చేస్తున్నాయన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తే రాష్ట్ర భవిష్యత్ మర్చిపోవడమేనని అన్నారు. రాజధాని రైతులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు కౌలు కోసం ముళ్ల కంచెలు దాటుకొని వచ్చి అమరావతిలో ఆందోళన చేశామని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం రైతులకు పట్టించుకోలేదని విమర్శించారు. కౌలు రైతుల కుటుంబాలకు తమ పార్టీ ఆధ్వర్యంలో రూ.లక్ష చొప్పున అందజేశామని గుర్తు చేశారు. అమరావతి సమస్య రాష్ట్ర ప్రజలందరి సమస్యని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, వర్ల రామయ్య, జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, బోనబోయిన శ్రీనివాస యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, అమరావతి జెఎసి నాయకులు పాల్గొన్నారు.

మాంజా మెడకు చుట్టుకుని జవాను మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాంజా దారం మెడకు చుట్టుకుని తీవ్ర గాయాల పాలై సైనికుడు మృతి చెందారు. ఈ ఘటన హైదరాబాద్ లంగర్‌హౌస్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నానికి చెందిన కోటేశ్వరరెడ్డి సైన్యంలో పనిచేస్తున్నారు. ఆదివారం విధులు ముగించుకుని మధ్యాహ్న సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తుండగా లంగర్ హౌస్ పైవంతెన వద్ద పతంగుల మాంజా దారం మెడకు చుట్టుకుని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి సమీపంలోని ఆస్పత్రికి తరలించిన ఫలితం లేకపోయింది. లంగర్‌హౌస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 161 | విజయవాడ, సోమవారం 15 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 15 January 2024 | Rs

పండగపూటా పస్తులు!

- 'ఉపాధి' కార్మికులకు మూడు నెలలుగా అందని డబ్బులు
- రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,000 కోట్ల బకాయిలు
- నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం

6



రన్నరప్ సాత్విక్-చిరాగ్ జోడీ

- ఫైనల్లో టాప్‌సీడ్ చేతిలో పరాజయం

8

అసైన్డ్ భూములపై త్రిసభ్య కమిటీ

విస్తీర్ణం హెచ్చు తగ్గుల నిర్ధారణ కోసం నియామకం • 20లోగా కమిటీకి నివేదించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ (భూ యాజమాన్యపు హక్కులు) కల్పించే ప్రక్రియలో భూవిస్తీర్ణంలో హెచ్చు తగ్గులు నివారించేందుకు ప్రభుత్వం తాజాగా జిల్లాల వారీగా త్రిసభ్య కమిటీని నియమించింది. ఆయా జిల్లాల్లో సంబంధిత జిల్లా రెవిన్యూ అధికారి (డిఆర్‌ఓ), జిల్లా రిజిస్ట్రార్ (డిఆర్) జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ (ఆర్‌ఓ) ఈ కమిటీలో సభ్యులుగా వుంటారు. జిల్లా కలెక్టర్లకు వచ్చే ఫిర్యాదులను కార్యాలయంలో రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదైనా, కాకపోయినా రిజిస్టర్ డాక్యుమెంట్స్ ఆధారంగా నమోదు చేసి కమిటీకి నివేదించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఈనెల 13న సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి త్రిసభ్యకమిటీని నియమిస్తూ విధి విధానాలు జారీ చేశారు. భూములకు యాజమాన్యపు హక్కుల కల్పించే ప్రక్రియను ఈనెల 18లోగా పూర్తి చేయాలని, 20కల్లా కలెక్టర్లకు వచ్చిన అభ్యంతరాలను పూర్తి చేసి కమిటీకి నివేదించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల పట్టాలు పొంది 20 సంవత్సరాలు దాటిన భూ యజమానులకు సంబంధించి సర్వే నెంబర్లను (నిషేధిత భూముల జాబితా నుంచి) తొలగింపు ప్రక్రియ జరుగుతోంది.



రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో భూముల విస్తీర్ణంలో తేడాలు వస్తున్నట్లు రైతుల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో రెవిన్యూ శాఖ అప్రమత్తమైంది. నిషేధిత జాబితా నుంచి తొలగింపు ప్రక్రియను సర్వే నెంబర్ల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కసరత్తు వేగవంతం చేయాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈనేపథ్యంలో ఆయా భూములకు సంబంధించి భూయాజమాన్యపు హక్కులు కల్పించేందుకు చివరిగా జిల్లా రిజిస్ట్రార్లకు పంపే జాబితాను మరొకసారి వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. కమిటీలో వెబ్‌ల్యాండ్ స్థితిగతులను ఆన్‌లైన్‌లో ప్రస్తావించకుండా జిల్లా కలెక్టర్ల నుంచి తొలగించడానికి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా రిజిస్టర్ చేసే అధికారులందరూ పత్రాలను నమోదు చేయాలని తొలగించాలని ప్రభుత్వం పేర్కొంది. వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా నీటి సంఘాల పరిధిలోని 11,266 ఎకరాల భూములకు సంబంధించి అసైన్డ్ పట్టాల విషయంలో పట్టాదారు కాలమ్ వద్ద ప్రభుత్వ భూమి, లేక గయాలు, మిగులుభూమి, పట్టాదారు పేరు లేకుండా ఖాళీగా ఉంచడం లాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవంగా సాగు దారులు ఎవరున్నారో వారిని గుర్తించి ఆయా భూ యజమానుల పేర్లతో భూ యాజమాన్యపు హక్కులు కల్పించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

జిల్లాల వారీగా జిల్లాసబ్ రిజిస్ట్రార్లకు పంపిన భూముల జాబితా ఇలా

రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు ప్రభుత్వాలు అర్హులైన పేదలకు 27.14లక్షల ఎకరాల భూములకు పట్టాలిచ్చింది. గతేడాది నవంబరు నెలలో నూజివీడు సభలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1521లక్షల ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇది ఇలా ఉంటే రెవిన్యూ శాఖ రాష్ట్రవ్యాప్తంగా సరైన రికార్డులు, భూమి తనదేనని చూపే డాక్యుమెంట్లు చూపలేదనే కారణంతో 11.61 ఎకరాల భూములున్నట్లు గుర్తించింది. తాజాగా ఈనెల 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 7.60 వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అన్ని అర్హతలున్నట్లు రెవిన్యూశాఖ గుర్తించింది. అందులో 4.42 లక్షల ఎకరాల జాబితాలను జిల్లా రిజిస్ట్రార్లకు ఆయా జిల్లాల కలెక్టర్లు జాబితాలను పంపారు. మరో 3.21లక్షల ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి జాబితాను నిర్ధారించాల్సి ఉంది.

- పట్టిక లోపలిపేజీలో..



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, భారతి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

సిఎం క్యాంప్ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు

గ్రామీణ వాతావరణం ఉట్టి పడేలా ప్రత్యేక సెట్టింగ్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో బోగి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాల వద్ద వైభవంగా సంక్రాంతి సంబరాలతోపాటు గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా, పూర్తిగా పల్లె వాతావరణం ఉండేలా ప్రత్యేక సెట్టింగ్‌లు వేశారు. వందేళ్ల క్రితం తిరుమల ఉన్న తరహాలో సెట్టింగ్‌లు కూడా వేశారు. బోగి పండుగ సందర్భంగా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాంప్రదాయ పంచెకట్టుతో సతీసమేతంగా వేడుకల్లో పాల్గొనగా, వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా గంగిరెద్దులకు సారె సమర్పించడం, భోగిమంటలు, గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు, హరిదాసుల కీర్తనలు, పిండివంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులతో సంక్రాంతి నృత్యాలతో వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సిఎమ్‌లు కొట్టు సత్యనారాయణ, నారాయణస్వామి, మంత్రి ఆదిమూలపు సురేష్, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, ఎంపి నందిగామ సురేష్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాజాలో అమానవీయతకు 100 రోజులు

- యుద్ధం మధ్యప్రాచ్యం అంతటా వ్యాపించింది
- లెబనాన్, ఇరాన్, యెమెన్లలో దాడులు
- ఎర్ర సముద్రం కూడా రణరంగంగా మారింది

7



ఇజ్రాయిల్ అమానవీయ దాడులకు గురై గాజాలోని షిఫా ఆసుపత్రిలో చికిత్స కోసం వేచిచూస్తున్న క్షతగాత్రులు



బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఓలేరులో ఢీకొంటున్న కోడి పుంజులు

'బరి'తెగింపు

- భారీ ఏర్పాట్లతో యథేచ్ఛగా కోడి పందాలు, జూదం
- తాళ్లపూడిలో బౌన్సర్ల ఏర్పాటు • చేతులు మారిన రూ. కోట్లు
- అధికార యంత్రాంగం విఫలం • అమలుకు నోచని హైకోర్టు ఆదేశాలు

2

ఆధ్యాత్మిక రంగాల్లో రాజకీయ జోక్యం తగదు

- పూరి శంకరాచార్య

7



'లక్షద్వీప్' పర్యాటకాభివృద్ధి ఉత్తుత్తిదే!

- విదేశీ చిత్రాలతో బిజెపి పెద్దల బడాయి ప్రచారం
- 'ఆల్ట్‌న్యూస్' పరిశోధనలో బయటపడ్డ బండారం

భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం

మోడీపై రాహుల్, ఖర్గే విమర్శలు

తౌబాల్ : మణిపూర్‌లోని తౌబాల్‌లో ఆదివారం భారత్ జోడో న్యాయ్ యాత్రను కాంగ్రెస్ ప్రారంభించింది. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, నాయకులు రాహుల్ గాంధీ భారత జెండాను ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా తౌబాల్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఖర్గే, రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. మణిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని రాహుల్ విమర్శించారు. మణిపూర్‌ను భారతదేశంలో ఒక భాగంగా మోడీ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు భావించడం లేదని ఆరోపించారు. 'మణిపూర్‌లో కొన్ని నెలలుగా హింసాకాండ చెలరేగుతోంది. లక్షలాది మంది ప్రజలు కష్టాలు అనుభవిస్తున్నారు. కానీ మీ కన్నీళ్లు తుడవడానికి, మీ చేయి పట్టుకోవడానికి ప్రధానమంత్రి మోడీ ఇక్కడకు రాలేదు. బహుశా మోడీకి, బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు మణిపూర్ భారత దేశంలో భాగం కాదేమో' అని రాహుల్‌గాంధీ వ్యంగ్యంగా విమర్శించారు. 'మణిపూర్ ప్రజల బాధను అర్థం చేసుకున్నాం. ఈ రాష్ట్రానికి సామరస్యాన్ని, శాంతి, ఆప్యాయతలను తిరిగి తీసుకుని వస్తాం' అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.



రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్రను ప్రారంభిస్తున్న ఖర్గే

ఖర్గే మాట్లాడుతూ 'ఓట్లు అడగడానికి మాత్రమే ప్రధాని మోడీ ఈ రాష్ట్రానికి వచ్చారు. అంతేకానీ రాష్ట్ర ప్రజలు బాధలో ఉన్నప్పుడు దుఖాన్ని పంచుకోవడానికి మాత్రం రాలేదు' అని మోడీని విమర్శించారు. 'మోడీకి సముద్రం వద్ద నడవడానికి, సముద్రంలో స్నానం చేయడానికి సమయం ఉంది. కానీ మణిపూర్‌కు రావడానికి లేదు. మోడీ 'రామ్, రామ్' అని జపిస్తూ ఉంటారు. కానీ ఓట్ల కోసం అలా చేయడం తగదు. మతాన్ని, రాజకీయాలను బిజెపి మిళితం చేస్తుంది. ప్రజలను రెచ్చగొడుతుంది' అని ఖర్గే ఆరోపించారు. సామాజిక న్యాయం, లౌకిక వాదం, సమానత్వానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని ఖర్గే హామీ ఇచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు.. ఫాసిస్టు శక్తులు వ్యతిరేకంగా పోరాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపడుతున్నారని ఖర్గే తెలిపారు.

కాగా, ఆదివారం ఉదయం ముందుగా ఇంఫాల్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి రాహుల్ నేరుగా 'ఖోంగ్‌జోమ్ యుద్ధ స్మారకం' వద్దకు వెళ్లారు. అక్కడ 1891 ఆంగ్లో- మణిపూర్ యుద్ధంలో అమరులకు నివాళులర్పించారు. అక్కడనుంచి 'న్యాయ్ మైదాన్'కు చేరుకున్నారు. మణిపూర్ నుంచి ముంబయి వరకు సాగే 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభించారు. ఈ యాత్ర మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 67 రోజుల పాటు 6,713 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. మార్చి 20 లేదా 21 తేదీల్లో ముంబయిలో ముగుస్తుంది.

అంగన్‌వాడీలను నిరాశపరిచిన ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు
- ఎస్మా ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతికి సంబరాలు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని ఆశించిన అంగన్‌వాడీలను రాష్ట్రప్రభుత్వం నిరాశపరిచిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. లక్షలమందికిపైగా ఉన్న అంగన్‌వాడీ మహిళలను రోడ్డుపైనే పండుగను జరుపుకునే దుస్థితిని కల్పించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని ఆదివారం ఉదయం సందర్శించారు. ఆదివారంతో అంగన్‌వాడీల సమ్మె 34వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం వారిపై ఉపయోగించిన ఎస్మా ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగ రోజు కూడా పట్టుదలగా ఆందోళన నిర్వహించిన అంగన్‌వాడీలకు సిపిఎం తరపున అభినందనలు తెలిపారు. సంక్రాంతి వారి పాలిట దీక్షగా మారి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్చలు జరిపి సమస్యను సంపూర్ణంగా పరిష్కరించి పండుగను ఇళ్లల్లో నిర్వహించుకునేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ సందర్శించారు. సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్రప్రభుత్వం బెదిరింపులు చేయడం తగదన్నారు. న్యాయపరంగా అంగన్‌వాడీల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని చెప్పారు. జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విస్తృతంగా జరుగుతుందని సుబ్బరావమ్మతో పాటు అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఎన్‌సిహెచ్ సుప్రజ, జైనీరత్నకుమారి, ఉమాదేవి, రాణి చెప్పారు. నిరవధిక నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. దీక్షా శిబిరంలో నాయకులు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు భోగిపళ్లు పోశారు. వేతనాలపై స్పష్టత వచ్చే వరకు సమ్మె విరమణ చేయబోమని స్పష్టం చేశారు.



విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తున్న వి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు

భోగి మంటల్లో ఉపాధ్యాయ వ్యతిరేక జిఓలు

- బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం
- రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరసనలు

2

విశాఖలో జివిఎల్ 'సంక్రాంతి' దందా!

- ప్రభుత్వ రంగ సంస్థలపై 'చందాల' భారం
- ఎస్‌బిఐ లక్షలాది రూపాయలు స్పాన్సర్ షిప్?

6

వైసిపికి కౌంట్‌డౌన్ మొదలైంది



- మళ్లీ ఈ ప్రభుత్వం వస్తే రాష్ట్ర భవిష్యత్ మర్చిపోవడమే
- భోగి వేడుకల్లో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్


వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలు, అమరావతి రాజధాని వ్యతిరేక ఉత్తర్వుల ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

2

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 15 జనవరి 2024



'సాహిత్య సృజన వ్యక్తిగతమైన వ్యాసంగం కాదు. అదొక సామాజిక బాధ్యత. శ్రామిక వర్గ ప్రయోజనం సాహిత్యంలో ఒక భాగం కావాలి.'

- వి ఐ లెనిన్



ఆశా దీపాల ముగ్గులు

ముగ్గు, మగువల చేతి వేళ్ల నుంచి
జారిపడుతున్నట్టు కనిపిస్తుంది కదా!
కాదు.. ముగ్గంటే
ఆడవాళ్ల అంతరంగపుటాకాశాల
నక్షత్రాల కాంతి ధూళి–
అది ఏడేడు లోకాల నుండి
ఈ నేలకు రాలి పడుతుంది

వాకిలి ఊడ్చి కళ్ళాపి జల్లి
ఇంటి ముందు ఒక అమ్మాయి ముగ్గు పెట్టడం అంటే
ఆమె నడుం మీద వాలిన ఇంద్రధనస్సు
కిందికి తొంగి చూసి
సప్తవర్ణాలలో సంబరంగా నవ్వడమే–

పండగ నెల పట్టగానే కాల పురుషుడు
ముగ్గురాళ్ల పొడిచేసి ముదితలకు కానుకగా ఇస్తాడు
ఎన్నెన్ని యుగాలుగా వనితల స్వప్నాలు
ఎన్నెన్ని రంగుల్ని పోగేసుకుంటాయో
చెంగుచెంగున గెంతే
ఆ రంగుల కలలే ఈ రంగవల్లికలు–

ఇవి కేవలం ముగ్గులు కాదు
మట్టి దేహం మీద
అతివల ఆత్మ సంతకాలు
ఇవి నేల కాగితం మీద
మహిళల మహా రచనలు

ముగ్గులంటే
పడుచు పిల్లల కోటి కోటి జన్మల లేత లేత సిగ్గులు–
ముగ్గులంటే
సకల చరాచర సంసారం బుగ్గల మీద
అమ్మవ్వలు తీర్చి దిద్దే శుభాశీస్సుల
రంగుల ఉషస్సులు–
ఇంటి నుంచి ఇంటికి వీధి నుంచి వీధికి
ఊరు నుంచి ఊరికి
సకల సంతోషాల సంగమ సంగీతాల
వెన్నెల జల్లులే రంగవల్లులు

గీతలు గీతలుగా రేఖలు రేఖలుగా
రంగులు రంగులుగా
మనుషుల్ని కలపడమే
సంక్రాంతి ముగ్గు సందేశం

అనంత మానవలోక సుఖశాంతుల కాంతి కోసం
కేవలం స్త్రీలు మాత్రమే
ప్రపంచం వాకిలి ముందు
వెలిగించే ఆశాదీపాలు ఈ ముగ్గులు


– ప్రసాదమూర్తి
8499866699

పెద్ద పండుగ

మూలపడిన పాత కలపతో కలిపి
బూజు పట్టిన రోత తలపుల్ని దులిపి
దగ్ధం చేయమంటోంది భోగి
ముచ్చటైన రంగవల్లుల ముంగిట
గంతులేయు గంగిరెద్దుల సాక్షిగా
కొత్త ధాన్యం పరమాన్నం భుజించు వేళ
అన్నదాతని అభినందించమంది సంక్రాంతి

తోడు నిలిచి పాడి నొసగు
పసిడి మనసుల పశు గణమును
పూజింప వచ్చిన కనుమ పండుగ
అనుదినమూ ఇదే రీతి
శ్రమను గౌరవించు సంస్కృతి
రక్ష కాగలదని చెప్పె నీతి !

– డా. డి వి జి శంకరరావు, మాజీ ఎంపీ
9440836931



సం 'క్రాంతులు' రావాలి

పాతకు గోరీ కడుతూ
కొత్తకు భేరీ కొడుతూ
భోగి మంటల సయ్యాటలా
బతుకు బతుకులో
సం'క్రాంతులు' రావాలి!

బాల్యపు బంతిపూలు
పురివిప్పిన నెమల్లవుతూ
గగనాన గాలిపటమై
ఆనందాల హరివిల్లులను
ఆవిష్కరించే సప్త వర్ణాల
సంక్రాంతులు రావాలి!

గంగిరెద్దులు నాట్యమాడినట్టు
బొమ్మల కొలువులు
ముచ్చట గొలిపినట్టు
జంగమ దేవరలు దీవించినట్టు
పాడిపంటలు పొంగి పొరలే
రైతు సంక్రాంతులు రావాలి

ఇళ్ల ముంగిళ్లలో
ముత్యాల ముగ్గులు మురిసినట్టు
చలిపొద్దు పొడుపులో
సూరీడు ఎర్రబారినట్టు
నవనవోన్మేశంగా
నవ సంక్రాంతులు రావాలి!

పడతులు పూల సజ్జలై
పట్టు పరికిణీలు కట్టినట్టు
చెరుకు కంకుల గడలు
తియ్యందనాలను చిమ్మినట్టు
అభి'రుచుల' సంక్రాంతులు రావాలి!

పిల్లల భోగిపళ్ల ముచ్చటలా
కోడి పందాల కోలాహలహేలలా
రథం ముగ్గులో గొబ్బిల్లలా
కొత్త పొంగలి రుచులతో
కొంగ్రొత్తగా సంక్రాంతి రావాలి..!

– డా.కటుకోర్ఘ్వుల రమేష్
99490 83327

లెనిన్ ధీరోదాత్తతను ఆవిష్కరించిన మయకోవస్కీ

"మయకోవ్‌స్కీని మొదటిసారి చదివినప్పుడు నాకు కలిగిన అనుభవం, ఆకాశాన్ని మెరుపులు చీల్చడం చూసినప్పటి లాంటిది. ఆ తిరుగుబాటు, ఆ ఉత్తేజం ఆ ఉరుములు, ఆ జ్వాల..... అన్నీ కొత్తవే. అప్పుడే నా మనస్సులో శాశ్వతంగా విప్లవమూ, మయకోవ్‌స్కీ ఒకటిగా రూపొందించడం జరిగింది.

– జూలియన్ టూవిమ్, పోలిష్ కవి.

వ్లాదిమిర్ మయకోవస్కీ పట్టుమని 37 సంవత్సరాలు కూడా బతకలేదు. అలెగ్జాండర్ పుష్కాన్ కన్న ఒక్క యేడాది తక్కువ. తన విషాద మరణానికి ఆరేళ్ళ ముందు "జూబిలీ" అనే గీతంలో మయకోవస్కీ పుష్కిన్ కవి కంచు విగ్రహంతో ఇలా అన్నారు :

"త్వరలో
నేను మరణిస్తాను,
మూగ పోతాను,
మరణించిన తర్వాత
మనం ఇద్దరం ఒకరి ప్రక్క ఒకరు
ఇంచు మించు దగ్గరగా నిలుస్తాం
"ప" అనే అక్షరం కింద నువ్వు
"మ" అనే అక్షరం కింద నేను!

మాస్కో నగరంలోని కేంద్ర గోర్కీ వీధిలో పుష్కిన్ మయకోవస్కీ చౌకులు దగ్గర దగ్గరలోనే ఉన్నాయి. నా మట్టుకు నాకు మాస్కో భూగర్భ రైలు మార్గంలోని స్టేషన్‌లన్నింటిలోనూ అందమైనది మయకోవస్కీ పేరు గలది ఒక్కటే అనిపిస్తుంది. ఇది పుష్కిన్ వీధికి ఎంతో దూరంలో లేదు.

సోవియట్ గ్రంథ విక్రయ సంస్థ లెక్క ప్రకారం ... పుష్కిన్ గ్రంథాల తర్వాత మయకోవస్కీ రచనలే ఎక్కువగా అచ్చు కావడం, తర్జుమా కావడం జరిగింది.

జార్జియా రిపబ్లిక్‌లోని బాగ్దాదీ అనే చిన్న గ్రామానికి సోవియట్లు అధికారంలోకి వచ్చిన తర్వాత "మయకోవస్కీ" అని పేరు మార్చారు. ఆ గ్రామం చుట్టూ కొండలు, జేగురు రంగు లోయల నిండా ద్రాక్షతోటలు ఉంటాయి. ఖనీస్ ట్స్కాలీ అనే కొండవాగు మయకోవస్కీ గ్రామం గుండానే ప్రవహిస్తోంది.

బాగ్దాదీ గ్రామంలో ఒక అరణ్యకుని కుటుంబంలో మన భావకవి 1893లో జన్మించారు. అతని తండ్రికి కోపం వచ్చినా పట్టలేము. సంతోషం వచ్చినా పట్టలేము. ఆయన గొంతుక పెద్దది. ఆప్యాయత గొప్పది.


మిగిలిన వాళ్ళ కంటే కవుల దృష్టి సూక్ష్మతరమైనది. కాబట్టి చిన్ననాటి దృశ్యాలూ, సంఘటనలూ కవుల మనస్సులలో చిరస్థాయిగా ఉంటాయి.

మయకోవస్కీ పెద్దవాడయ్యాక రాసిన "నేను ప్రేమిస్తున్నా" అనే గీతంలో తన బాల్యాన్ని ఇలా స్మరించాడు :

"సూర్యుడు చూశాడు. తల పోశాడు వింతగా!
నలుసులాగ నాకు సరిగ్గా కనపడనే లేదే వీడు!
అయినా ప్రయత్నిస్తున్నాను.
వీడి చిరు గుండెలు కొట్టుకొంటున్నాయి."

చదవడం సరిగ్గా రాకముందే సాహిత్యం తన జీవితంలో ఒక భాగమైంది మయకోవస్కీకి. తల్లి అలెగ్జాండ్రా అలెక్సేవ్నా చదువుతూ వుంటే వినేవాడు. ప్రశాంతమైన కాటుక కళ్ళు ఆమెవి. మనిషి చిన్నదే కాని చూపులు తీవ్రమైనవి. పుష్కిన్ మహాకవి పట్ల అందరి కన్నా ఎక్కువ పరిచయం కుదిరింది మయకోవస్కీకి. ఇది యావజ్జీవితమూ అతణ్ణి అంటి పెట్టుకొనే ఉంది.

"నా కాలం గురించీ, నా గురించి నేనే చెపుతున్నా" అనే స్వీయ చరిత్రాత్మక ఖండికల్లో మయకోవస్కీ నిషిద్ధ విప్లవ గేయాల ద్వారా తనకు విప్లవ దృక్పథం అలవడిందని తెలియజేశాడు. ఆనాటి నుంచి కవిత్వమూ విప్లవమూ అతడి మనసులో అల్లుకుపోయాయి. తన జీవిత సర్వస్వాన్నీ అతడు వాటికే అంకితం చేశాడు.



సందర్భం

• • •

సోవియట్ కవి జన తారా మండలంలో మయకోవస్కీది అగ్రస్థానమని ఈనాడు అందరూ అంగీకరించారు. కాని హఠాత్తుగా అతడు విప్లవ మహాకవి కాలేదు. కవితా శిఖరాగ్రాలను చేరుకోవడానికతడెన్నో కష్టాలు పడ్డాడు. ప్రాచీన సాహిత్యం, ముఖ్యంగా బ్లాక్, పుస్కిన్‌ల రచనలు అతణ్ని విశేషంగా ప్రభావితం చేసినప్పటికీ మొట్టమొదటిసారి (1913లో) కవితా వ్యాసంగం ప్రారంభించినప్పుడు సంప్రదాయ విరోధిగా సాహిత్య రంగంలో అడుగు పెట్టేడు. ఔను.. అతని తొలి గీతాల్లో వెనుకటి తరాల కవులను అవహేళన చేసే పోకడలు ఎన్నో ఉన్నాయి.

"నాకు తెలుసు
నా చెప్పులో ఒక మేకు గుచ్చుకొంటోంది
అది గెథే భావనా శక్తి కన్నా
భయంకరమైనది."

ఈ "చెప్పులోని రాయి" భావాన్ని చాలా సందర్భాల్లో వ్యక్తిగతంగా కనిపించే గీతాల్లో మయకోవస్కీ తెలియజెప్పినప్పటికీ, ఆ వెంటనే ఇలా అంటాడు.

"నేను చేసిన, చేయబోయిన వాటి
అన్నిటికన్నా మిన్న
ప్రాణంతో స్పందించే ఒక అల్పాల్ప జీవి"

మనుష్యుల మానవత్వంలోను, ప్రాణుల సజీవత్వంలోనూ తన్ను తాను చూసుకునే ఈ చైతన్యమే, విప్లవాత్పూర్వపు విద్యుత్ ప్లావితశక్తుల విజృంభణలో తన "వ్యక్తిత్వాన్ని" చుట్టూవున్న మానవ మహా సముద్రంలో ముంచివేసి అతని చేత ఈ విధంగా రాయించింది.

"అదిగో, ఆకలితో ఎదురు తిరిగిన జన సందోహాల అగ్రస్థానాన
మానవుల దూరదృష్టి కుచించుక పోయిన చోట
విప్లవ కంటక కిరీటంలో 1916 ముందుకు
చొరుచుకు రావడం చూస్తున్నాను,
మీ అందరి మధ్య నేను
దాని ప్రవక్తని నేనే!
ఎక్కడెక్కడ బాధ ఉందో అక్కడక్కడ నేనున్నాను,
కార్చిన ప్రతి కన్నీటి బిందువులో
నన్ను నేను సిలువ వేసుకున్నాను."

• • •

మయకోవస్కీ 25 అక్టోబరు 1917 తన జీవితంలోకల్లా మరుపు రాని రోజు అంటాడు. ఆ రోజున సోషలిస్టు విప్లవం మొట్టమొదటి రోజున స్మోల్నీకి వెళ్ళి లెనిన్‌ను చూశాడు. అక్టోబరు విప్లవం ప్రత్యక్ష ప్రభావంతో అతడు రాసిన ప్రత్యక్షరమూ ఉత్సవోత్సాహంతో రింగు రింగుమంటుంది. విప్లవానంతర కాలంలో అతడు రాసిన కవిత అక్టోబరు విజయాన్ని సాధించిన విప్లవ ప్రజానీకపు ఘన కార్యాలను కొనియాడే భావగీతాలూ, డైరీలూ, ఈ ప్రజలు, విప్లవ శత్రువుల సాయుధ ప్రతిఘటనను ఛిన్నాభిన్నం చేశారు. వినాశనాన్నీ క్షామాన్నీ జయించారు. సోషలిజం వైపుగా తిరుగులేని ముందడుగు... ఇవే మయకోవస్కీ తన కవిత్వంలో కన్నులను కట్టినట్టుగా అభివర్ణించాడు.

మొక్కవోని "విప్లవ నావికుడు"గా మయకోవస్కీ తన కవిత్వపు రెక్కలను ఆకాశపుటంచులలోకి విప్పేడు. కంటికి కనిపించిన ప్రతి విషయమూ అతని కవితా వస్తువయింది. ఇందుకెన్నో రచనా వద్ధతులను అనుసరించాడు. హేళన, భావగీతి, ప్రబంధం... ఏది రాసినా అతని నిజాయితీ అందులో ప్రతిబింబించింది. మానవునికీ విప్లవానికి ప్రతినిధిగా ఆయన నిలబడ్డాడు.

"అట్టడుగు అగాధాల నుంచి
కష్ట జీవులు కమ్యూనిజంలోని కొస్తారు.
గనుల గర్భాల నుంచి
కొడవళ్ళ లోంచి,
కార్ఖానాల నుంచి!
నేను సమున్నత కవితా శిఖరాల నుంచి
కమ్యూనిజంలోకి దూకుతాను!
కమ్యూనిజం నా హృదయం, అది వినా
నాకు ప్రేమ లేదు."

పై విధంగా అతడు "గృహోన్ముఖంగా" అనే గీతంలో రాశాడు. "ఉచ్చైస్వనంతో" అనే ఒక అసంపూర్ణ గీతంలో భావితరాల వారిని సంబోధిస్తూ ఇలా అన్నాడు:

"నా పద్యాల నుంచి
ఒక్క రూబుల్ కూడా నాకు దొరక లేదు.
వజ్రంగుల బల్లలూ, కుర్చీలూ
మా యింటికి పంపడం లేదు,
కాని నాకు కావలసినదంతా
ఒక చలువ చేసిన చొక్కా
మిగిలినవంటే నాకసహ్యం
నిజం చెపుతున్నా
అవంటే నా కనిష్టం"

కవిగా మయకోవస్కీ వ్యక్తిత్వం సంపూర్ణమైనది. ఏదైనా కావాలని అతడావాహన చేశాడంటే అందులో అతనికి పూర్తి విశ్వాసమున్నదన్న మాట.

"మానవుణ్ణి హీనస్థితి నుండి
విడుదల చెయ్యడానికి
నిర్మాణాలు చేసేవాళ్ళ
తుడిచే వాళ్ళ
మెరుగుపెట్టేవాళ్ళ పక్షాన నిలబడతాను.
ఇప్పుడు నా దంటూన్న,
ఇక ముందు వచ్చేవారికి మూడింతలవుతూన్న
స్వదేశం గురించి పాడుతాను."

ఎవరైనా ఒక విషయాన్ని నమ్మితే వెనుక చూపు లేకుండా త్రికరణ శుద్ధిగా దాన్ని ఆచరణలో పెట్టాలి. చూడండి ఈ దిగువ పాదాలు :

"ఎల్లప్పుడూ ప్రకాశించాలి
ఎల్లచోట్లా ప్రకాశించాలి
చిట్టచివరి దాకా ప్రకాశించాలి
ఇదే నా మతం, మంత్రం
సూర్యుడిదీ ఇదే !

మయకోవస్కీ, వర్తమాన భావి కాల ప్రజలకు ధారాదత్తం చేసిన వారసత్వం. "వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్" అనే జీవిత చరిత్రాత్మక కావ్యంలో నైనా, 'కామ్రేడ్ నెట్టేకి'కి నా "సోవియట్ పాస్‌పోర్ట్'లోనైనా సూర్యకాంతి ఉంది. వెలుతురుంది. లెనిన్ ఆశయాల ప్రకారం వికసిస్తున్న నూతన సమాజం పట్ల అచంచల విశ్వాసం ఉంది.

మయకోవస్కీ గురించి ఎంతయినా చెప్పవచ్చు. అదో అంతంలేని విషయం. కార్మికుల, విద్యార్థుల ఎదుట అతని అనేక ప్రసంగాలు, విదేశ యాత్రలు (ఈ యాత్రలలో అతడు సోవియట్ యూనియన్ గురించి యథార్థాలను వివరించేవాడు.) బాలబాలికల కోసం రాసిన పద్యాలు (పెత్యా కథ, దుక్కబ్బాయి, పలచని అబ్బాయి సిమా, సముద్రం గురించీ, దీపస్తంభం గురించీ రాసిన పాట ఏమవాలి). ప్రకటనల కవిత్వం, పోస్టర్ చిత్రాలు (మయకోవస్కీ మంచి చిత్రలేఖకుడు) ఇటువంటి ఎన్నింటి గురించి అయినా రాయవచ్చు. మయకోవస్కీ జీవితం ఒక జ్వాలలాగ ప్రజ్వలించింది. లెనిన్ ఏర్పరిచిన ప్రభుత్వంలో విద్యాశాఖ ప్రజామంత్రి అయిన ఏ.వి.లూనాచర్‌స్కీ ఇలా రాశారు. : ".... మయకోవస్కీని స్వయంగా ఎరిగిన వారికి గాని, రచనల ద్వారా తెలుసుకున్న వారికి గాని అతడంటే జీవితం అని అర్థం. గంట కొట్టినట్టుండే అతని కంఠధ్వనిలో ఈ జీవితాన్ని చూస్తాను. నేను అతను కావ్యగానం చేస్తున్నా, ఉపన్యసిస్తూన్నా అందులో క్రమబద్ధమైన ఒక లయ ఉంటుంది. ఈ ప్రశాంతి వెనుకనే ఒక బలం ఉంది. ఔను. ఇది తరుగులేని ఒక జీవశక్తి ఎల్లప్పుడూ అతని సంకల్ప బలానికి విధేయంగా ఉంటుంది. జీవితపు మహోన్నత రూపాల్లో ఇదొకటి. మయకోవస్కీ పుస్తకాల్లో ఎక్కడ తెరిచినా జీవితం ఒక వరదలాగా ముంచెత్తుతుంది."

• • •

జీవితం! జీవితం! జీవితం!
మయకోవస్కీ జీవిత వర్ణనలో ఘటికుడు.
మరి మృత్యువు?

అనుకోనిది, అతి విషాదకరమైనదీ అతని మరణం. ఆత్మహత్య చేసుకున్నాడతను. "అందరికీ" రాసిన అతని ఆఖరి ఉత్తరంలో "ప్రేమ నౌక జీవిత పర్వతాన్ని తాకి బద్దలైంది." అన్న ఒకమాటతో కేవలం వ్యక్తిగత కారణాలే తన చర్యకు దారితీశాయని చెబుతూ "లేని పోని ఊహాగానాలు చెయ్యకండి" అన్నాడు. అదే ఉత్తరంలో "ఇది సరియైన పద్ధతి కాదు. దీన్ని నేను సిఫారును చెయ్యను. కాని, నాకు మరో మార్గం లేక పోయింది. అన్నాడు.

మయకోవస్కీలో ఇంత నిరాశాపూరితమైన భావాలు కలిగించిన వ్యక్తి గత కారణాలేవో మనకి తెలియవు. మనకి తెలిసిందంతా అతని వ్యక్తి జీవితం అస్తవ్యస్తమూ అవ్యవస్థితమూ, లోతుగా చూస్తే ఏకాంతమూ అని మాత్రమే! విశాంత్రి లేకుండా పనిచేసి అతని నరాలు అలసిపోయాయని కూడా మనకు తెలుసు. వీధిలో నడుస్తూన్నా, బిల్లియర్డ్స్ ఆడుతున్నా, రైలుబండిలో ఉన్నా నిర్విరామంగా తన కవిత్వం మీదనే కృషి చేసేవాడు.

"మయకోవస్కీ మెట్రో (భూగర్భ) స్టేషన్"ను స్వచ్ఛమైన ఉక్కుతో చేశారు. ప్రచండమూ, నిరాడంబరమూ, ఆమోఘమూ అయిన ఉక్కు, నాణాల తయారీకి కాదు. తప్పు అంటే దానికి భయంలేదు. చిరకాల మన్నిక గలిగిన ఈ ఉక్కు భూగర్భంలోని విద్యుద్దీపాలను ప్రతిబింబిస్తుంది. పైన భూమి మీద లెనిన్ అనే సూర్యుడు 1920లో యారోస్లావ్ రైల్వే లైన్ మీదుగా 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోని మయకోవస్కీని చూడడానికి వచ్చిన లెనిన్ ప్రకాశిస్తారు.

(ఇది మయకోవస్కీ రచన 'లెనిన్ కావ్యం' ముందు మాట. ఈనెల 21న లెనిన్ శత వర్ధంతి సందర్భంగా శ్రీశ్రీ తెలుగు అనువాదం నుంచి ఇస్తున్నాం.)

– అలెగ్జాండర్ నెస్తెరెంకో

ప్రశ్నలు లేవనెత్తే పదునైన కవిత్వం

"రాజ్యం, చట్టం ఏ వ్యక్తికీ సమానత్వాన్ని నిరాకరించదు లేదా భారత భూభాగంలో ఎక్కడైనా చట్టంలో సమాన రక్షణను కల్పిస్తుంది."

– భారత రాజ్యాంగం ఆర్టికల్ 14


వర్తమాన భారతదేశం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రయాణం చేస్తోంది. లౌకిక ప్రజాస్వామిక భావనలకు మతోన్మాద పాలకులు పాతర వేయడం పరిపాటిగా మారింది. దీనికి తార్కాణమే మణిపూర్ మారణహోమం. కవి చౌశా తన కవిత్వానికి బి.ఫయినోమ్ అని శీర్షిక నిర్ణయించడంతోనే తాను దేని గురించి రాశాడో అర్థమవుతుంది. మణిపూర్‌లో గల బి.ఫయినోమ్ గ్రామంలో మహిళల్ని అత్యాచారం చేసి చంపేసిన ఘటన జరిగింది. ఈ అకృత్యాలపై హెచ్‌డీ ఫోటోగ్రఫీ కవిత్వమే ఈ బి.ఫయినోమ్.

పుస్తకం

మణిపూర్ ఇప్పటికీ కులాల కుమ్ములాటలో కొట్టుమిట్టాడుతోంది. ఒక తెగవారు మాకు ఎస్టీలో చోటు కల్పించాలని కోరితే మరో రెండు తెగల వారు అస్సలు కేటాయించవద్దని డిమాండ్ చేస్తున్నారు. అగ్నికి వాయువు తోడైనట్లు డబుల్ ఇంజన్ సర్కార్ ఇందుకు మరింత చిచ్చు రగిలిస్తోంది. అందుకే కవి చౌశా ఒక కవితలో ఇలా అంటాడు..:

"డబుల్ ఇంజన్ సర్కారు../ ప్రజల పాణాలతో చెలగాటం ఆడుతూ/ గోడమీద పిల్లిలా చోద్యం చూస్తోంది". కవి చౌశా చాలా స్పష్టతతో అవగాహనతో ఈ వర్తమాన ప్రపంచంలో ఏం జరుగుతున్నదో దానికే అక్షరరూపం ఇచ్చాడు. ఈ కవి నిరంతరం వర్తమాన సమాజంలోని సంక్లిష్టతల్ని కవిత్వంగా రాస్తున్నాడు. అమానవీయ ఘటనలు ఏవి కనబడ్డా ఆవేదన చెంది, కవిత్వంగా వెలువరిస్తున్నాడు. 'అమానవీయ రాజకీయాలను ఎండగడుతూ అబద్ధాన్ని చీలుస్తూ అక్రమాలను దౌర్జన్యాలను స్వ పర బేధం లేకుండా శస్త్ర చికిత్స చేసే అక్షరాయుధాల సముదాయమే కవిత్వమని నిఖిలేశ్వర్ అంటారు. అలా సాగిస్తున్నాడు చౌశా. అందుకే మణిపూర్ కన్నీరు చూసి కలత చెందుతున్నాడు.

"ఏడ్చే కళ్లు/ కార్చే కన్నీటి దుఃఖమంతా/ కాల్వ కట్టి నదిలా మారింది!/ కొండలు, బండల మీదుగా/ లోయలో ప్రయాణించి... రాష్ట్రం దాటి/ బిగ్గరగా ఏడుస్తూ../ దేశమంతా ప్రవహిస్తోంది!/ ఢిల్లీ వీధుల్లో/ పార్లమెంటు భవనం ముందు/ ప్రధాని ఇంటి ముందు / ఆగి ఆగి పారుతోంది!/ ఎవరైనా/ తన బాధను చూస్తారేమోనని/ తన అశక్తతను వింటారేమోనని/



కనీసం ఓదారుస్తారని కిటికీ/ సందుల్లోంచి/ తొంగి తొంగి చూస్తోంది!/ ఎవ్వరికీ ఆ నదీ ప్రవాహం/ వినబడదు! కనబడదు!/ ఎందుకంటే.../ కాపలాదారుడు/ ఆయన పరివారం.../ కొన్ని నెలలుగా/ కుంభకర్ణుడిలా/ గాఢనిద్రలో ఉన్నారు!/ అక్కడక్కడా/ ఎక్కడో.../ ఒకరో ఇద్దరో.../ మనుషులు/మాత్రమే/ దుఃఖనదిని చూసి జాలిపడుతున్నారు/ చలిస్తున్నారు!/ ఐకమత్యంతోనే/ఒక్కటిగానే కన్నీటిని ఆపగలం (దు:ఖనది)

ఈ ఒక్క కవితలో మణిపూర్‌లో ఏం జరుగుతుందో ఆవిష్కరించాడు కవి. నిజంగా ఇప్పుడది దు:ఖనది. మోడీ పాలనలో మహిళలకు రక్షణ లేదనే సత్యాన్ని మణిపూర్ ఘటన తేటతెల్లం చేసింది. మోదీ పాలనలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో గణాంకాలే చెబుతాయి. ఈ కవిత చూడండి మన దేశంలోని మహిళల రక్షణ ఎంత బాగుందో కనబడ్తుందో..

"నా దేశంలో/ పైశాచికత్వం పరిఢవిల్లుతోంది! / రాక్షసత్వం రాజ్యమేలుతోంది!/ క్రూరత్వం పెచ్చుమీరుతోంది! మానవత్వం మంటగలిసింది!/ విద్వేషం విలయతాండవం చేస్తోంది!/ ఉన్మాదం రెచ్చిపోయింది!/ నేటి ఆటవిక అంధ యుగంలో పోలీసులు దిష్టిబొమ్మలు! స్టేషన్లు పాడుబడిన కొంపలు!/ ప్రజల రక్షణ గాలిలో దీపం! మహిళల మానానికే తీరని అవమానం!/ ఆడబిడ్డలను అవమానించి/ వివస్త్రలుగా ఊరేగించి/ సామూహిక అత్యాచారం చేసిన/ మేకిన్ ఇండియాను చూసి/ సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది!/ నిస్సిగ్గుగా/ తల ఎత్తుకుని రాజకీయ వ్యభిచారం చేస్తున్న/ పాలక హంతకులను ఏం చేద్దాం/ సమాధానం చెప్పాలని నిలదీద్దాం!

దేశంలో విద్వేష విజబీజాలను నాటిందెవ్వరో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. "యంత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత్నా" అని వాళ్ళు అప్పుడప్పుడు అంటూ ఉంటారు. ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఆనందంతో నాట్యం చేస్తారనేది దీని అర్థం. కానీ, ఈ డబుల్ ఇంజను పాలకులు మాత్రం స్త్రీలను అలా చూడరు. మత విభజన చేసి, మారణకాండకు పాల్పడతారు. ఇన్ని దారుణాలు జరిగినా కేంద్ర రాష్ట్ర పాలకులు తగు విధంగా స్పందించటం లేదు. ఎందుకంటే కవి చెప్పినట్లు.. " వాడు... కపట నాటక సూత్రధారి/ మొసలి కన్నీరు కార్చేవాడు!/ ప్రజా సమస్యలను విస్మరించినవాడు/ చిచ్చు పెట్టి చలికాచుకునేవాడు/ మతాన్ని అడ్డుపెట్టుకున్నవాడు/ ప్రజాస్వామ్యంపై నమ్మకం లేనివాడు/ హిట్లర్‌ను మించిన నియంత నరహంతకుడు!/ వాడే నేటి పాలకుడు! (నేటి పాలకుడు)

మరి ఈ పరిస్థితి మారటానికి ఏం చేయాలి? ప్రజలే జాగురూకులై కదలాలి. 'ఈ బతుకులు మనకొద్దు ఈ విద్వేషం అసలొద్దు!/ ఇప్పుడే మొదలు పెట్టాలి/ నీతి నైతిక విలువల పునాదులపై / సామాజిక, సాంస్కృతిక ఉద్యమం!/ ప్రజాతంత్ర ఐక్యత సాధించే/ అద్భుత పోరాటం!/ కులమతాలు లేని/ ప్రాంతం, భాష లేని / ఒకే జాతిగా/ సంఘటిత శక్తిగా ఎదగాలి!/ ఎట్టుబడిదారుల/ సామ్రాజ్యవాదులను ఓడించే/ వీరులుగా/ ధీరులుగా తయారవ్వాలి!/ కార్మిక రాజ్యం నిర్మించి ఆదర్శంగా నిలవాలి/ ఉన్నత మనిషిగా ఎదగాలి!' ఇది ఈ కవి అభిలాష. పరిష్కార మార్గం కూడా!

అందుకే ప్రగతిశీల కవులు, అభ్యుదయవాదులు ఈ దేశం నలుమూలలా ఎక్కడ ఏ అఘాయిత్యం జరిగినా కదం తొక్కుదాం. ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేద్దాం. ఈ దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకుని లౌకికరాజ్యాన్ని కాపాడుకుందాం.

- కెంగార మోహన్
94933 75447

26న విజయవాడలో లౌకిక కవనం

మతతత్వ నిరంకుశ ధోరణులను నిరసిస్తూ సాహితీస్రవంతి అధ్వర్యంలో ఈనెల 26 రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడ నగరంలోని ఎంబి భవన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ లౌకిక కవనం జరుగుతుంది. రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక విలువలను ప్రతిఫలించే, ప్రబోధించే కవితలను, పాటలను వినిపించేందుకు కవి, గాయకులకు ఆహ్వానం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ ఐఏఎస్ అధికారి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏఎండి ఇంతియాజ్, గౌరవ అతిథిగా ఐవిరావు, ప్రముఖ కవులు ఖాదర్ మోహిద్దీన్, గుంటూరు లక్ష్మీనరసయ్య, చల్లపల్లి స్వరూపరాణి మందరపు హైమావతి హాజరై ప్రసంగిస్తారు. ఈ లౌకికకవనంలో పాల్గొనేవారు తమ పేర్లు నమోదు చేసుకోవటానికి 94933 75447, 94900 99059 నెంబర్లను సంప్రదించవచ్చు.

18న అంగన్‌వాడీ సంఘీభావ కవనం

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు సంఘీభావంగా ఈనెల 18వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో శ్రామిక కవనం నిర్వహించనున్నాం. ఇందులో పాల్గొని సంఘీభావ కవిత్వం వినిపించాలని కవులను, కవయిత్రులను కోరుతున్నాం. పాల్గొనగోరు మిత్రులు శాంతిశ్రీ – 83338 18985 వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోగలరు.

– సాహితీస్రవంతి, విజయవాడ

ఉగాది కవితల పోటీ

శ్రీకార్తీక డెవలపర్స్, సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉగాది కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి రూ.2500, ద్వితీయ బహుమతి రూ.2000, తృతీయ బహుమతి రూ.1500, రెండు ప్రత్యేక బహుమతులు : ఒక్కొక్కటి రూ.1000 ఉంటాయి. ఉగాది గురించే రాయనక్కరలేదు. కవిత ఏ అంశానికి చెందినదైనా ఉండవచ్చు. 20 లైన్లకు తక్కువ గాకుండా 30 లైన్లకు మించకుండా ఉండాలి. హామీపత్రం జతపరచాలి. కవి పేరు, చిరునామా, ఫోన్ నెంబరు వగైరా హామీపత్రంపై మాత్రమే ఉండాలి. కవితలు పంపాల్సిన చివరి తేదీ : 29.02.2024. చిరునామా : ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3,హైదరాబాద్-500102. ఫోన్:94907 51681

ప్రసేన్‌కు అక్షరం లిటరరీ అవార్డు-2024

కవి, విమర్శకుడు, సినిమా విశ్లేషకుడు బెల్లంకొండ ప్రసేన్‌కు అక్షరం లిటరరీ అవార్డు-2024 ఇస్తున్నట్లు ట్రస్టు కార్యదర్శి జి.వెంకటకష్ణ ప్రకటించారు. ప్రముఖ కవి కాశీభట్ల వేణుగోపాల్ ప్రారంభించిన ఈ పురస్కారం గతేడాది ప్రముఖ పబ్లిషర్ సిద్దారెడ్డి అందుకున్నారు. కవి ప్రసేన్... అఫ్సర్, సీతారాంలతో కలిసి 1985లో 'రక్తస్పర్శ' కవిత్వ సంపుటిలో మొదట కన్పిస్తారు. 1991లో 'ఇంకా ఉంది' కవితా సంపుటిని, 1995లో 'ఏదీ కాదు' కవితా సంపుటిని వెలువరించారు. జర్నలిస్టుగా ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, టీవీ5 లలో సబ్ ఎడిటర్‌గా, వ్యాఖ్యాతగా పనిచేసి రిటైరయ్యారు. ఇటీవల 'ఎవరికి వర్తిస్తే వారికి' అనే కవితా సంపుటి వెలువరించారు.

ప్రత్యేక దళిత పంచాయతీల ఏర్పాటుకు త్వరలో జిఒ

- ఫైర్ డిజిపి సునీల్‌కుమార్

ప్రజాశక్తి- చింతలపూడి (ఏలూరు జిల్లా)

ప్రత్యేక దళిత పంచాయతీ ఏర్పాటుకు త్వరలోనే జిఒ ఇస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు నివారణ శాఖ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఏలూరు జిల్లా చింతలపూడిలో స్థానికులతోకలిసి భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి దళితవాడ ప్రత్యేక పంచాయతీ కావాలని, దళితులు తమను తాము పరిపాలించుకోవాలని, రూ.రెండు కోట్ల నిధులు చొప్పున ఇవ్వాలని కోరారు. దళితవాడల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం, మోడ్రన్ పాఠశాలలు, మంచి ఉచిత హాస్పిటల్స్ రావాలని పదేళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సిఎంను కలిసినప్పుడు నెల రోజుల్లో ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలు చేయటం తన లక్ష్యమని చెప్పారు. ఎంఎల్ఎ, ఎంపీ సీట్లు వద్దని, అటువంటి ఆలోచన తనకు లేదని అన్నారు.

హంపీ ఎక్స్‌ప్రెస్ రైలులో బ్రిటన్ మహిళపై లైంగిక దాడి

బెంగళూరు : ప్రయివేటీకరణ చర్యల వల్ల రైళ్లలో ప్రయాణికులకు భద్రత లేకుండా పోతోంది. కర్ణాటకలోని హోస్పేట్ నుంచి బెంగళూరు వెళ్తున్న హంపీ ఎక్స్‌ప్రెస్ రైలులో బ్రిటన్‌కు చెందిన పర్యాటకురాలి (30)పై లైంగిక దాడి చోటుచేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు సహాయం చేసే పేరుతో రైల్వేలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న బాగల్‌కోట్‌కు చెందిన బసవరాజ్(22) లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు చెప్పారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనపై దిగ్భ్రాంతికి గురైన బాధిత మహిళ బెంగళూరు చేరుకున్నాక..తన మిత్రునితో కలిసి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. బసవరాజ్‌ను అరెస్టు చేశామన్నారు. కాగా అతడిని విధుల నుంచి కూడా సస్పెండ్ చేసినట్లు రైల్వే శాఖ పేర్కొంది.

జకో, సిన్నర్ శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ పోటీలో జకోవిచ్ 6-2, 6-7(5-7), 6-3, 6-4తో అన్‌సీడ్, క్రొయేషియాకు చెందిన పిజ్కక్‌ను చిత్తుచేశాడు. ఇతర పోటీల్లో 4వ సీడ్, పోలండ్‌కు చెందిన సిన్నర్ 6-4, 7-5, 6-3తో జాండ్‌స్కుల్స్((నెదర్లాండ్స్), 5వ సీడ్ రుబ్లేవ్(రష్యా) 7-5, 6-4, 3-6, 4-6, 7-6(10-8)తో ఐదు సెట్ల హోరాహోరీ పోరులో బ్రెజిల్‌కు చెందిన తియారోపై చెమటోడ్చి నెగ్గాడు. ఇతర పోటీల్లో 12వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా) 26వ సీడ్ బజ్(అర్జెంటీనా), ప్రత్యర్థులను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరారు.

ఓటమి అంచున ఆంధ్ర

- ముంబయితో రంజీమ్యాచ్

ముంబయి: రంజీట్రోఫీ రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రజట్టు ఓటమి అంచున నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబయిని 395పరుగులకు ఆలౌట్ చేసినా.. తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 184పరుగులకే ఆలౌటైంది. ఆదివారం ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 165పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆంధ్ర జట్టులో విహారి(46), కెప్టెన్ రికీ బుయ్(28)కి తోడు రషీద్(52) అర్ధసెంచరీకి తోడు నితీశ్ కుమార్(22) క్రీజ్‌లో ఉన్నారు. మూడోరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 45పరుగులు వెనుకబడి ఉంది. నేడు ఆంధ్రజట్టు ఆలౌట్ అవ్వకుండా ఉంటేనే ఓటమిబారినుంచి బయటపడనుంది.

సమస్యల సుడిగుండంలో సర్వేయర్లు

- ప్రమోషన్ ఛానెల్‌కు నోచుకోని వైనం
- స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారికి ప్రాక్టికల్ ఎగ్జామ్స్ లేనట్లేనా..?



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వేలో కీలకంగా వ్యవహరించే గ్రామ సర్వేయర్లు సర్వీస్ సమస్యల పరిష్కారానికి నోచుకోక కొట్టుమిట్టాడుతున్నారు. తమకు ఇప్పటి వరకు ప్రమోషన్ ఛానెల్ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎపిపిఎస్‌సి నిర్వహించే డిపార్టుమెంట్ టెస్టులు విలేజ్ సర్వేయర్లకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కి వెళ్లే డిపార్టుమెంట్ టెస్టుకు సంబంధించి నోటిఫై ఎపిపిఎస్‌సి చేయడం లేదని, ఫలితంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామ సర్వేయర్లు వాపోతున్నారు. గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు రీ డిజిగ్నేషన్ చేసినంత మాత్రాన తమకు అదనంగా వచ్చే బెనిఫిట్స్ లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేడ్ ప్రమోట్ చేస్తే రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు అదనంగా కలవాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఎటువంటి ఆర్థిక బెనిఫిట్స్‌ను ప్రభుత్వం కల్పించకపోవడంపై గ్రామ సర్వేయర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సీనియార్టీ లిస్టు విషయంలోనూ ప్రభుత్వం జాప్యం చేస్తోందని, నిత్యం తమతో కలిసి పనిచేసే విఆర్‌ఒలకు సంబంధించి లిస్టు తయారైందని పేర్కొంటున్నారు.

రెండో విడతలో స్పోర్ట్స్ కోటాలో విధుల్లో చేరిన వారు ప్రత్యేక కారణాల వల్ల డిపార్టుమెంట్ పరీక్షలు పాస్ కాలేదని, కొందరు మరలా పరీక్షలు రాసి పాసైనప్పటికీ ఇప్పటికీ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకపోవడంతో వారంతా తక్కువ వేతనంతో పనిచేస్తున్నారు. ఎక్స్ సర్వీస్ కోటాలో విధుల్లో చేరిన వారికి ఎక్స్ సర్వీస్ బేసిక్ వర్తించేలా చూడాలని ఉన్నతాధికారులకు సర్వేయర్లు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటికీ ఆ ఫైలుకు మోక్షం కలగలేదు. భూముల రీ సర్వే విషయంలో ఒక్కో గ్రామ సర్వేయర్‌కు ప్రత్యేకంగా ల్యాప్‌టాప్ కావాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని, మండలానికి మూడు ల్యాప్‌టాప్‌లు ఇవ్వడంతో డేటా ఎంట్రీలో పొరపాట్లు దొర్లుతున్నాయని సర్వేయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యూజిఐఎస్, వెక్టరైజేషన్, డేటా ఎంట్రీ, విఎస్, విఆర్‌ఒ, ఎంఆర్‌ఒ లాగిన్స్, సబ్ డివిజన్ చేయడం వంటి పనులు ల్యాప్‌టాప్‌తోనే చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భూముల రీసర్వే విషయంలో ఏ సమస్య వచ్చినా తమపై నెట్టేస్తున్నారని, విఆర్‌ఒ నుంచి రెవెన్యూ అధికారుల వరకు జాయింట్ ఎల్‌పిఎమ్‌ల వరకు, సబ్ డివిజన్ విషయంలో తప్పులనూ తమపైకి నెట్టేయడం ఎంతవరకూ సబబు అని గ్రామ సర్వేయర్స్ యూనియన్ ప్రశ్నిస్తోంది.

పందాలు, జూదాలను అడ్డుకోవాలి

కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

చట్ట వ్యతిరేక కోడిపందాలు, జూదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేసింది. కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా సంప్రదాయం పేరుతో కోడిపందాలను కొంతమంది రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సైతం నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఈ మూడు రోజులు పందాలు, జూదాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. సంప్రదాయాన్ని ప్రోత్సహించడం అంటే గ్రామీణ క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను, ప్రజలకు ఆరోగ్యకర వినోదాన్ని అందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జూదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిపందేల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులను అనర్హులుగా ప్రకటించాలని కోరారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కోర్టులే తగిన పరిశీలనా యంత్రాంగాన్ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధంగా కోడిపందేలు జరగడానికి ముఖ్యమంత్రి, హోం శాఖామంత్రిని ప్రధాన బాధ్యులుగా, దోషులుగా పరిగణించాలని డిమాండ్‌చేశారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్, ఎపి, ఎఎస్‌పి, డిఎస్‌పి స్థాయి అధికారులను కోర్టు ఆదేశాల అమలులో వైఫల్యానికి బాధ్యులను చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని, ప్రజలు, యువతీ యువకులు, విద్యార్థులు భాగస్వాములయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వివిధప్రాంతాల్లో వివిధ రకాల క్రీడలను నిర్వహిస్తున్న, ప్రోత్సహిస్తున్న సంఘాలను, సంస్థలను, ప్రజలను సిపిఎం అభినందించింది.

కుల వివక్ష అంతానికి ఐక్య పోరాటాలు

- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

సమాజంలో కుల వివక్ష రోజురోజుకూ పెరుగుతోందని, దాని అంతంకై ఐక్య పోరాటాలు మరింత ఉధృతం చేయాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మార్మూడి విక్టర్ ప్రసాద్, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శోభారాణి కలిసి కెవిపిఎస్ జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారుమూడి ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకై దళితులందరూ ఐక్యంగా అసమానతలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అంటరానితనం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు, ఎపి బహుజన జెఎసి ఫౌండర్ తాళ్లూరి మధు, రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెఫ్, గౌరవాధ్యక్షులు కాటం స్టాలిన్, కార్యదర్శి డివి.సాగర్ పాల్గొన్నారు.

మామిడి రైతు గట్టెక్కేనా?

- గత ఏడాది తీవ్ర నష్టం
- ఈ ఏడాది విరబూసిన పూత
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ (తిరుపతి జిల్లా)

ఈ ఏడాది మామిడి చెట్లలో పూత విరబూసింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత పదేళ్లుగా రైతులు ఎంతో కష్టపడినా పూత పూసి కాయ వచ్చే దశలో ఏదో ఒక కారణంగా విపరీతమైన గాలులతో పూత రాలిపోయి తీవ్ర నష్టం వచ్చేది. ఈ సారి అలాంటి పరిస్థితి కొంత తగ్గి పూత అధికంగా వుండడంతో మామిడి రైతుల్లో ఆశలు రెట్టింపై వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో సుమారు 800 ఎకరాల్లో మామిడిని రైతులు పండిస్తున్నారు. గాజు లపెళ్లూరు, కుక్కంబాకం, బిఎన్‌కండ్రిగ, అడిగల కండ్రిగ, కొత్తపాళెం, పివికండ్రిగలలో మామిడి అధికంగా వుంది. సుమారు పదుల సంఖ్యలో రైతులు వున్నారు. వీటి నుంచి వచ్చే తోతాపురి, బంగినిపల్లి, తదితర రకాల మామిడి పళ్లను సమీపంలోని జ్యూస్ ఫ్యాక్టరీకి తరలి స్తుంటారు. అయితే ఈ రెండు రకాల మామిడి పళ్లను మాత్రమే వారు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మిగిలిన రకాల మామిడి పళ్లను రహదారి పక్కనే కూర్చొని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా టన్నుకు సుమారు 1500 రూపాయలు మాత్రమే గిట్టుబాటు ధర లభిస్తోంది. సుమారు 20 టన్నుల మామిడి ప్రతి సంవ త్సరం వస్తోంది. కొనుగోలు చేసేవారు లేక పోవడంతో వందల రూపాయల్లో కూడా ఆదాయం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది వర్షాలకు తీవ్ర నష్టం

గత ఏడాది వర్షాలకు మామిడి పూత దశలో తీవ్ర నష్టం వచ్చింది. వాటికి తగిన పరిహారం కూడా చెల్లించ లేదు. ఈ సారి పరిస్థితి అలాలేదు. పూత బాగా వుంది. ఈ పూత నిలిచేందుకు అన్ని రకాల మందులు పిచికారీ చేస్తున్నాం. రేయింబవళ్లు తోట వద్దే కాపాలా వుంటు న్నాను. అయినా పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం మామిడికి తగిన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. నేను మామిడి తోటలో వెయ్యి కోడి పిల్లలను కూడా పెంచుతున్నాను. గత పదేళ్లుగా మామిడి తోటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా ఎలాంటి గిట్టుబాటు ధర రావడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- రవికుమార్ నాయుడు, రైతు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండలంలో పండించే మామిడి పండ్లకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. గతంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన పంటకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. సుమారు మండలంలో 15 ఎకరాల మామిడి తోటల్లో చెట్లు పడిపోయాయి. వాటికి ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. పెట్టిన వేల రూపాయల పెట్టుబడుల్లో వందల రూపాయలు కూడా రావడం లేదు.

- అజయ్ కుమార్ రెడ్డి , రైతు.

ఆదాయ పంపిణీలో అసమానతలు

- స్థిర ఆదాయం పొందే వారిలో కొంత మెరుగు
- దినసరి వేతనాలలో భారీ వ్యత్యాసం
- స్వయం ఉపాధిలోనూ అంతంతే

న్యూఢిల్లీ : దేశంలో మహిళా కార్మికుల కూర్పులో మార్పు చోటుచేసుకుంటోంది. వృద్ధులు, విద్యార్థులు తక్కువగా ఉన్న వారు పనులకు దూరమవుతుంటే యువతులు, విద్యావంతులు కార్మిక శక్తిలో భాగస్వాములవుతున్నారు. 1983లో దేశంలో సుమారు 33% మంది గ్రామీణ మహిళలు జీతాలు తీసుకుంటూ ఉపాధి పొందారు. అయితే 2017 నాటికి ఇది 20%కి పడిపోయింది. అప్పటి నుండి గ్రామీణ భారతంలో ఉపాధి రేటు పెరుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే మహిళల్లో దినసరి వేతన కార్మికుల సంఖ్య తగ్గిపోతుంటే స్థిరమైన వేతనాలు పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఫలితంగా పురుషులు, మహిళల మధ్య ఆదాయ వ్యత్యాసం తగ్గుతోంది.

2021-22లో స్థిరమైన జీతాలు తీసుకుంటున్న పురుషుల సగటు నెలసరి ఆదాయం రూ.17,910 కాగా మహిళల ఆదాయం రూ.13,666. అదే రోజువారీ వేతనాలు పొందే వారిలో ఈ వ్యత్యాసం బాగా అధికంగా ఉంది. పురుషులు సంపాదించే దానిలో కేవలం 60% మాత్రమే మహిళలు పొందుతున్నారు. ఉదాహరణకు మహిళలు రోజుకు రూ.230 మాత్రమే సంపాదిస్తుంటే పురుషులు మాత్రం రూ.358 పొందుతున్నారు. దురదృష్టవశాత్తూ సంస్కరణల అనంతర కాలంలో స్వయం ఉపాధి పొందిన మహిళల వాటా స్థిరంగా ఉంది. అయితే ఇది కోవిడ్, ఆ తర్వాత కాలంలో కొంత పెరిగింది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే స్వయం ఉపాధి పొందుతున్న పురుషులు ఆర్జిస్తున్న మొత్తంలో కేవలం 40% మాత్రమే మహిళలు సంపాదించగలుగుతున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న పురుషులు నెలకు సగటున 12,099 సంపాదిస్తుండగా మహిళలు మాత్రం కేవలం రూ.4,809 మాత్రమే ఆర్జిస్తున్నారు.

ఆదాయ పంపిణీలో ఈ అసమానతలకు కారణం ఏమిటి? స్వయం ఉపాధి పొందుతున్న వారు, స్థిరమైన జీతాలు పొందుతున్న వారు, రోజువారీ సంపాదనతో జీవిస్తున్న వారు...ఇలా ఈ మూడు తరగతులకు చెందిన పురుషులు, మహిళల ఆదాయాల మధ్య వ్యత్యాసాలు వేర్వేరుగా ఉంటున్నాయి. స్థిరమైన జీతాలు పొందుతున్న వారికి సంబంధించి పురుషులు సంపాదిస్తున్న దానిలో సగటున 90% వరకూ మహిళలు పొందుతున్నారు. అదే స్వయం ఉపాధి పొందుతున్న వారిలోనూ, రోజువారీ సంపాదన పొందే వారిలోనూ ఈ అంతరం అధికంగా ఉంటోంది. ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే రెండవ, మూడవ త్రైమాసిక కాలాల్లో మాత్రం ఆదాయ అంతరాలు తగ్గుతున్నాయి. దీనికి రెండు కారణాలు ఉండవచ్చు. లేబర్ మార్కెట్‌లో లింగ వివక్ష తగ్గుతూ ఉండవచ్చు. యజమానులు పురుషులను, మహిళలను సమానంగానే చూస్తుంటారు. లేదా మహిళల పని స్వభావం మారుతూ ఉండవచ్చు. ఎందుకంటే విద్యావంతులు, వృత్తిపరమైన నైపుణ్యం ఉన్న వారు లేబర్ మార్కెట్‌లో ప్రవేశించారు. ఇతర రంగాలకు సంబంధించి వ్యవసాయంలో తక్కువ మంది, సేవల రంగంలో ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు.

భోగి వేడుకల్లో అంబటి సందడి

- మంత్రి రాంబాబు మరోసారి స్టెప్పులు



డ్యాన్స్ చేస్తున్న మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

భోగి వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు మరోసారి సందడి చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జరిగిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. భోగి మంటను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. అనంతరం సినిమా పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేసి సందడి చేశారు. మంత్రి అంబటితోపాటు వైసిపి నాయకులు కూడా డ్యాన్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఉత్సాహపరిచేందుకే డ్యాన్స్ చేస్తున్నానని చెప్పారు. పవన్ కల్యాణ్ చెప్పినట్లు తాను సంక్రాతి సంబరాల్లో మాత్రమే సంబరాల రాంబాబునని, అనంతరం పొలిటికల్ రాంబాబునని చెప్పారు. గెలుపు.. ఓటములతో సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తానని తెలిపారు. గతేడాది కూడా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఇదేవిధంగా మంత్రి డ్యాన్స్ చేయడం అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే.

నా కుమారుడి జీవితాన్ని నాశనం చేసింది జగనే..

- గుంటూరులో శ్రీనివాస్ కుటుంబ సభ్యుల నిరసన



నిరసన తెలుపుతున్న శ్రీనివాస్ కుటుంబీకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడుగా ఉన్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆదివారం గుంటూరులో నిరసన తెలిపారు. అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తల్లి సావిత్రి మాట్లాడుతూ తన కుమారుడు ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్నాడని, బెయిల్ కూడా ఇవ్వలేదని అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడం వల్ల తన కుమారునికి బెయి ల్ రావడం లేదని తెలిపారు. నా కుమారుడి జీవితాన్ని జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారని ఆరోపించారు. జీవిత చరమాంకంలో తనకు అండగా ఉండాల్సిన తమ కుమారుడు జైలులో ఉండడం వల్ల ఐదేళ్లుగా తాము మానసిక క్షోభకు గురవతున్నామని చెప్పారు. సిఎం జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని అర్థించారు. అంటరానితనం నిర్మూలన పోరాట సమితి నాయకులు జి.చార్వాక మాట్లాడుతూ సిఎం జగన్ తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోర్టుకు హాజరుకాకుండా ఒక దళిత కుటుంబాన్ని ఐదేళ్లుగా క్షోభకు గురి చేయడం సరికాదన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల న్యాయపోరాటంలో తాము అండగా ఉంటామని తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్‌పై ఆరా

- గత అక్టోబరు నుంచి వివరాలు సేకరణ
- అన్ని బ్యాంకులకూ ఐటిశాఖ సూచనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టే నగదు లావాదేవీలపై ఆదాయపు పన్నుశాఖ దృష్టి సారిస్తోంది. అధికమొత్తంలో జరిగే లావాదేవీల వివరాలు సమర్పించాలంటూ బ్యాంకులకు సర్క్యులర్లు పంపింది. త్వరలోనే రాష్ట్రంలో లోక్‌సభతోపాటు శాసనసభ ఎన్నికలు కూడా జరుగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు పంపడం గమనార్హం. ప్రధానంగా డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్‌పై ఆరా తీస్తోంది. ఎన్నికల సమయంలో భారీగా అక్రమ నగదు లావాదేవీలు పరిపాటిగా మారిన నేపథ్యంలో కఠినంగా వ్యవహరించాలని ఐటిశాఖ నిర్ణయించింది. అందుకే ఒకేరోజు రూ.పది లక్షలు కన్నా ఎక్కువ నగదును డిపాజిట్ చేసినా, విత్‌డ్రా చేసినా, నెల రోజుల్లో రూ.50 లక్షలు కన్నా ఎక్కువ నగదు విత్‌డ్రా చేసినా, డిపాజిట్ చేసినా ఆ వివరాలు సేకరించే పనిలో ఐటిశాఖ నిమగ్నమైంది. ప్రధానంగా గత అక్టోబరు ఒకటి నుంచి జనవరి వరకు జరిగిన ఇటువంటి లావాదేవీల వివరాలు త్వరగా అందించాలని నిర్దేశించింది. జనవరి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు నగదు లావాదేవీల వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. దీనికోసం ప్రత్యేకంగా ఒక మెయిల్ ఐడిని కూడా ఆదాయపు పన్నుశాఖ ఏర్పాటు చేసింది. కీలక లావాదేవీల వివరాలను దైనందిక పద్ధతిలో ప్రతిరోజూ సమర్పించాలని ఐటి అధికారులు బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు.

మొబైల్ లావాదేవీలపైనా..

ఒకే మొబైల్ నెంబరు నుంచి ఎక్కువ మొబైల్ నెంబర్లకు సంబంధించిన ఖాతాలకు రెండు వేల రూపాయలు వరుసగా పంపించిన లావాదేవీల వివరాలు కూడా సేకరించే పనిలో ఐటిశాఖ నిమగ్నమైంది. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి నేరుగా నగదు ఇవ్వకుండా మొబైల్‌లో ఉన్న ఆర్థిక యాప్‌ల ద్వారా నగదును పంపడం ఎక్కువవుతున్న నేపథ్యంలో ఇటువంటి లావాదేవీలపైనా దృష్టి సారిస్తోంది.

40% మంది సిట్టింగ్‌లకు టిక్కెట్లు హుళక్కే?

- అభ్యర్థుల ఎంపికపై బిజెపి అధిష్టానం కసరత్తు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి ఎంపీలలో ఆందోళన పెరిగిపోతోంది. వారిలో 40% మందికి ఈ దఫా టిక్కెట్లు దక్కకపోవచ్చునని వార్తలు వస్తున్నాయి. బిజెపిని ఓడించితీరాలనే లక్ష్యంతో ప్రతిపక్షాలు 'ఇండియా'గా ఐక్య వేదిక ఏర్పాటు చేసి సమరోత్సాహంతో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో గెలుపు గుర్రాలను మాత్రమే బరిలో నిలపాలని బిజెపి భారీగా కసరత్తు చేస్తోంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో అనేకాంశాలు పరిగణలోకి తీసుకుంటూ టిక్కెట్‌కు అర్హతల జాబితాను ప్రిపేర్ చేస్తున్నట్లు తెలిసింది. ఇదే ఆశావహుల్లో టెన్షన్ రేపుతోంది. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన సీనియర్ నేతలకు మళ్లీ అవకాశం ఇవ్వబోతున్నారు. సంక్లిష్టమైన నియోజకవర్గాలలో మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల తరహాలోనే సీనియర్లను దింపుతారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో గెలిచినప్పటికీ వరుసగా మూడుసార్లు విజయం సాధించిన వారికి, 70 సంవత్సరాల వయసు పైబడిన వారికి కూడా మరోసారి అవకాశం దక్కవచ్చు. కొన్ని రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలను సైతం అర్హతా నిబంధనల నుండి మినహాయించనున్నారు. ప్రస్తుతం ఇలాంటి ఎంపీలు 130 మంది వరకూ ఉన్నారు.

344 స్థానాలపై దృష్టి

ఎన్నికల్లో మరోసారి విజయం సాధించేందుకు బిజెపి నాయకత్వం ప్రధానంగా 344 స్థానాలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. ఈ స్థానాల్లో బిజెపి ఏదో ఒక ఎన్నికలోనో లేదా గడచిన మూడు ఎన్నికల్లోనో విజయం సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి కేవలం ఒక శాతం ఓట్ల తేడాతో 27 స్థానాలను, రెండు శాతం ఓట్ల తేడాతో 48 సీట్లను గెలుచుకుంది. వీటిలో అత్యధిక స్థానాల్లో అభ్యర్థులను మార్చే అవకాశం ఉంది. ఇక ప్రస్తుత ఎంపీలలో 61 మంది 70 సంవత్సరాల పైబడిన వారే. వీరిలో వరుసగా మూడుసార్లు గెలుపొందిన 20 మందిని మినహాయించి మిగిలిన వారందరినీ మారుస్తారని సమాచారం.

199 స్థానాల్లో ఎప్పుడూ ఓటమే

గత ఎన్నికల్లో 224 స్థానాల్లో బిజెపి 50% కంటే ఎక్కువ ఓట్లు పొందింది. వీటిలో 42 సీట్లలో బిజెపి అభ్యర్థులు తమ ప్రత్యర్థులను భారీ మెజారిటీతో...అంటే 35-52% ఓట్ల తేడాతో ఓడించారు. వీటిని సురక్షితమైన స్థానాలుగా పార్టీ భావిస్తోంది. ఈ స్థానాల్లో ఈసారి యువతకు ఎక్కువ అవకాశం ఇవ్వాలని బిజెపి యోచిస్తోంది. గత మూడు ఎన్నికల్లో టిక్కెట్ల పంపిణీ, అనుసరించిన వ్యూహాలను కమలనాథులు విశ్లేషిస్తున్నారు. 95 నియోజకవర్గాల్లో పార్టీ వరుసగా మూడుసార్లు గెలిచింది. 173 స్థానాల్లో రెండుసార్లు, 76 స్థానాల్లో ఒకే ఒకసారి విజయం సాధించింది. మొత్తంగా 344 స్థానాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సార్లు బిజెపి గెలుపొందింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 199 స్థానాల్లో ఆ పార్టీ ఒక్కసారి కూడా గెలవలేకపోయింది.

కేంద్ర మంత్రులకు బాధ్యతలు

కొన్ని కీలక రాష్ట్రాల్లో భాగస్వామ్య పార్టీలతో తెగతెంపులు చేసుకున్న తర్వాత గత ఎన్నికల్లో బిజెపి కొన్ని సీట్లను కోల్పోయింది. వీటిపై మరింత దృష్టి సారించి ఉంటే మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవని పార్టీ వ్యూహకర్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే హోం మంత్రి అమిత్ షా సహా సుమారు 50 మంది కేంద్ర మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు నుండి మూడు స్థానాలు కేటాయించారు. పశ్చిమ బెంగాల్, అసోం, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలపై బిజెపి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. తెలంగాణలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీ పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ముఖాముఖి పోరు తమకు లాభించవచ్చునని పార్టీ వర్గాలు అంటున్నాయి. పార్టీ బలహీనంగా ఉన్న స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది. ప్రధాని, హోంమంత్రి వంటి అగ్రనేతల పేర్లను కూడా అప్పుడే ప్రకటించవచ్చు. రాజ్యసభకు చెందిన సీనియర్ మంత్రులను, ఆయా రాష్ట్రాల్లో బలమైన నేతలను పార్టీ బలహీనంగా ఉన్న చోట్ల బరిలో దింపవచ్చునని సమాచారం.

శబరిమల యాత్రికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

- టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శబరిమల వెళ్లే యాత్రికుల పట్ల రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. దీక్ష విరమణ సమయంలోనూ ప్రత్యేక బస్సులు కేటాయించకపోవడంతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ మంత్రిగానీ కనీసం సమీక్షలు చేసే పరిస్థితి కూడా లేదని తెలిపారు. ప్రత్యేక చర్యలు లేకపోవడంతో దర్శనం కాకుండానే వెనుదిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రవాణా సౌకర్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.


అనంతపురంలో ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు


కాకినాడ జిల్లా కేంద్రంలో సమ్మె శిబిరం వద్ద భోగి మంటల్లో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు


కర్నూలు ధర్నా చౌక్ వద్ద నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

భోగి మంటల్లో ఎస్మా ప్రతులు

- సమ్మె శిబిరాల్లో పిండి వంటలతో నిరసనలు
- కొనసాగిన కోటి సంతకాల సేకరణ
- 34వ రోజూ అంగన్‌వాడీల సమ్మె
- పోరాటానికి యుటిఎఫ్ సంఘీభావ నిధి

ప్రజాశక్తి - యంత్రాంగం

వేతనాలు పెంపు, గ్రాట్యుటీ అమలు కోసం పోరాడుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా విధించి సంజాయిషీ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె శిబిరాల్లో భోగి మంటలు వేసి ఆ ప్రతులను దగ్ధం చేశారు. పిండివంటలు చేసి తమ నిరసనను కొనసాగించారు. అలాగే కోటి సంతకాల కార్యక్రమాన్ని కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐదుసార్లు అంగన్‌వాడీ యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి పాతపాటే పాడారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటానికి యుటిఎఫ్ నాయకులు సంఘీభావ నిధిని అందించారు.


అల్లూరి జిల్లా కూనవరంలో భోగి మంటల్లో జిఒ ప్రతులను వేసి దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

గుంటూరు కలెక్టరేట్ ఎదుట భోగి మంటలు వేసి ఎస్మా జిఒ-2 ప్రతులను దగ్ధం చేశారు. తాడికొండ, తుళ్లూరు శిబిరాలను ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి సందర్శించి మాట్లాడారు. ఎస్మా జిఒలను భోగిమంటల్లో వేశారు. రమాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న నోటీసులు తాటాకు చప్పుళ్లతో సమానమని, వాటికి బెదిరిపోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడం చేతగాని రాష్ట్ర ప్రభుత్వం ఆ నెపాన్ని అంగన్‌వాడీలపై వేస్తోందని మండిపడ్డారు. డిమాండ్లను అంగీకరించకుంటే నిరవధిక దీక్షలకూ వెనకాడబోరని హెచ్చరించారు. చేబ్రోలులో సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి పోరాట సంఘీభావ నిధికి రూ.మూడు వేలు అందించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సమ్మె శిబిరం వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అంగన్‌వాడీలకు మద్దతుగా కరపత్రాలను ముద్రించి కౌలు రైతు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఖాళీ గిన్నెలు, కంచాలతో మోత మోగిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విశాఖ, అల్లూరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మండపేట, ముమ్మిడివరం, మామిడికుదురు, కాకినాడ జిల్లా కేంద్రమైన కాకినాడతోపాటు, పెద్దాపురం, జగ్గంపేట రూరల్, కిర్లంపూడి, కరప మండలాల్లోని సమ్మె శిబిరాల వద్ద భోగి మంటలు వేసి ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో హరిదాసు వేషధారణతో నిరసన తెలిపారు.

కర్నూలు ధర్నా చౌక్‌లో నోటికి రిబ్బన్లు కట్టుకుని నిరసన దీక్షలు చేపట్టారు. నంద్యాలలో ముఖ్యమంత్రి, మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల చిత్రపటాలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఒంగోలు కలెక్టరేట్ వద్ద, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యాప్తంగా ఎస్మా ప్రతులను భోగి మంటల్లో వేశారు.

చిత్తూరు జిల్లాలోని కుప్పం, నగరి, కార్వేటినగరం, పలమనేరు, శాంతిపురం, బైరెడ్డిపల్లిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నోటీసులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పుత్తూరులో మట్టి తింటూ నిరసన తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షల్లో నగర పరిధిలోని కార్యకర్తలు, హెల్పర్స్ కూర్చున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా భోగి మంటల్లో ఎస్మా ప్రతులను వేసి దగ్ధం చేశారు. పొందూరు, కోటబొమ్మాళిలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు.

ఎంపి లావుకు బుజ్జగింపు!

- నర్సరావుపేటలో పోటీపై మంతనాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మార్పుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. గుంటూరుకు మారాలనే పార్టీ అధిష్టానం ప్రతిపాదనను ఆయన నిరాకరించారు. నర్సరావుపేట నుండి కాకుంటే పోటీ నుంచి విరమించుకుంటానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయులును టిడిపిలోకి తీసుకుని నర్సరావుపేట ఎంపి టికెట్ ఇచ్చేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నించారు. ఇది తెలిసిన వైసిపి అగ్రనాయకులు ఒక మెట్టు దిగారు. రాష్ట్రంలో ఇప్పటికే పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు వైసిపిని వీడుతున్న వేళ శ్రీకృష్ణదేవరాయులు పార్టీ నుంచి వెళ్లిపోతే నష్టం జరిగే ప్రమాదం ఉండడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆదివారం గుంటూరులోని ఎంపి నివాసానికి వచ్చిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆయనతో విస్తృత మంతనాలు జరిపారు. పార్టీలోనే ఉండాలని, నర్సరావుపేట నుంచి పోటీకి సిఎంను ఒప్పిస్తామని తెలిపారు. తాను నర్సరావుపేటలో ఎన్నో ప్రాజెక్టులు తెచ్చానని, రానున్న ఐదేళ్లలో ఈ పనులను పూర్తి చేసేందుకు మరోసారి ఇక్కడే పోటీ చేస్తే గెలిసే అవకాశం ఉంటుందని, ఇప్పుడు గుంటూరుకు మారిస్తే కష్టమని శ్రీకృష్ణదేవరాయులు వాదిస్తున్నారు. అయితే, గుంటూరులో పోటీ చేయకపోతే శ్రీకృష్ణదేవరాయులు స్థానంలో నర్సరావుపేటకు బిసి అభ్యర్థిని నిలబెట్టాలని సిఎం జగన్ నిర్ణయించారు. అధిష్టానం మెత్తపడకపోవడంతో టిడిపిలోకి వెళ్లేందుకు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నాలు ప్రారంభించారు. అధికారికంగా ఇంకా ఎటువంటి ప్రకటనా రాకపోవడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

పండగపూటా పస్తులు!

- 'ఉపాధి' కార్మికులకు మూడు నెలలుగా అందని డబ్బులు
- రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,000 కోట్ల బకాయిలు
- నిధుల విడుదలలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధి కార్మికులు పండగపూటా పస్తులుండాల్సి వచ్చింది. చేసిన పనికి మూడు నెలలుగా వారికి వేతనం అందలేదు. భోగి, సంక్రాంతి పండగకు ముందైనా అందుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితులు తలెత్తడంతో వ్యవసాయ పనులు అంతగా దొరకలేదు. రబీలోనూ అవే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, చాలామంది ఉపాధి హామీ పనులకు వెళ్లారు. మూడు నెలలుగా ఉపాధి డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఏం తినాలి? ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రాష్ట్ర వ్యాప్తంగా 68,15,751 కుటుంబాలు రిజిస్టరయ్యాయి. 49,22,340 కుటుంబాలకు ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు పని కల్పించింది. పనుల కోసం వ్యక్తిగతంగా 1,19,40,068 మంది రిజిస్టర్ కాగా, 82,40,494 మందికి పని లభించింది. ఉపాధి కార్మికులకు వేతనాన్ని రెండు రకాలుగా చెల్లిస్తున్నారు. చెరువులు, కాలువలు వంటి పనులు చేసిన వారికి చెల్లించే డబ్బులను వేజ్ పేమెంట్‌గా పరిగణిస్తారు. ఆర్‌బికె, సచివాలయాలు, గోకులాలు, రోడ్లు వంటి పనులకు మెటీరియల్ వేజస్‌గా చెల్లిస్తారు. ఈ రెండు కేటగిరిల్లోనూ పెద్ద ఎత్తున బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్లపైనే పెండింగ్ ఉన్నట్లు జిల్లా నీటి యాజమాన్య అధికారి తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మెటీరియల్ కాంపొనెంట్ కూలి డబ్బులు రూ.20.36 కోట్లు, వేజ్ కాంపొనెంట్ కింద రావాల్సిన డబ్బులు రూ.31.51 కోట్లు పెండింగ్ ఉన్నాయి. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులకు గతేడాది అక్టోబర్ 18 వరకు, వేజ్ పేమెంట్లకు సంబంధించి గతేడాది నవంబర్ 12 వరకు కూలీలకు చెల్లింపు జరిగింది. ఆ తర్వాత చేసిన పనులకు డబ్బులు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధులను ఇతర పథకాలకు వాడుకోవడంతో కార్మికులకు సకాలంలో డబ్బులు అందడం లేదంటూ చెల్లింపుల బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పని చేసిన డబ్బులతోనే కుటుంబాలను నెట్టుకొచ్చే వారే అధిక శాతం మంది ఉన్నారు. డబ్బులు అందక అయిన కాడికి అప్పులు చేస్తున్నారు. గ్రామాల్లో కిరాణా దుకాణాల వద్ద అప్పు చేసి సరుకులు తెచ్చుకుంటున్నారు. అప్పు పుట్టని వారు పస్తులు ఉంటున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్ ఫొటో)

అప్పు చేసి సరుకులు

గతేడాది అక్టోబర్‌లో ఉపాధి పనికి వెళ్లాను. వారానికి రూ.1,400 చొప్పున నాలుగు వారాల డబ్బులు రావాలి. అధికారులను అడిగితే ఇదిగో... అదిగో అంటున్నారు. గ్రామంలో తెలిసిన వారి దగ్గర అప్పు చేసి సరుకులు తెచ్చుకుంటున్నాం.

-కల్లేపల్లి దుర్గారావు, తిమడాం గ్రామం

పండగ ముందైనా ఇస్తారనుకున్నాను

గత నెల మొదటి వారంలో ఉపాధి పనికి వెళ్లాను. వారానికి రూ.1200 చొప్పున ఐదు వారాల డబ్బులు రావాలి. పండగ ముందైనా డబ్బులు పడతాయని ఆశగా చూశాను. డబ్బులు పడకపోవడంతో పండగ పూట కూడా పస్తు ఉండాల్సి వచ్చింది.

- కె.రాజాబాబు, తిమడాం (శ్రీకాకుళం జిల్లా)

విశాఖలో జివిఎల్ 'సంక్రాంతి' దందా!

- ప్రభుత్వ రంగ సంస్థలపై 'చందాల' భారం
- ఎస్‌బిఐ లక్షలాది రూపాయలు స్పాన్సర్ షిప్?
- కేంద్రం అండ చూసేనా?


జివిఎల్ మహా సంక్రాంతి సంబరాల్లో ఎస్‌బిఐ ఏర్పాటు చేసిన స్టాల్ (ఇన్‌సెట్‌లో) జివిఎల్ మహాసంక్రాంతి సంబరాలు అంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆయన ఇక్కడ నుంచి ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. కేంద్ర, రాష్ట్రాల్లో ఏ సభకూ విశాఖ నుంచి గెలవలేదు. కనీసం నామినేట్ చేయబడలేదు. బిజెపి నాయకునిగా విశాఖ కేంద్రంగా గడిచిన రెండేళ్ల నుంచీ హడావుడి చేస్తూ సొంతంగా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఆయనే జివిఎల్ నరసింహారావు. విశాఖపట్నంపై దృష్టి సారించి రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ విశాఖ పార్లమెంట్ పరిధిలో పర్యటనలు చేస్తున్నారు. సంక్రాంతి మహా సంబరాల పేరుతో విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ.కోట్లు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్షలాది రూపాయలు ఇచ్చినట్లు సమాచారం.

ప్రభుత్వ రంగ సంస్థల అధిపతులతో భేటీ ఇందుకేనా?

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖలో పరిశ్రమల అధిపతులతో నిత్యం సమావేశాలు, భేటీలు నిర్వహిస్తూ 'కేంద్రం తనను ఎపికి దూతగా పంపింది' అంటూ జివిఎల్ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులు సుమారు రెండేళ్లుగా కేంద్రంపై పోరాడుతుంటే ఆ ఉద్యమంపై నీరుజల్లేందుకు ఆయన తప్పుడు ప్రకటనలకు పాల్పడుతున్నారు. 'ప్రయివేటీకరణ ఆగిపోయిందని ఒకసారి, కేంద్ర స్టీల్ మంత్రితో చర్చించానని, అమిత్ షా హామీ ఇచ్చారని మరోసారి ప్రకటనలు ఇస్తూ, తప్పుదారి పట్టించే యత్నం చేశారు. చైతన్యవంతమైన స్టీల్ కార్మికవర్గం జివిఎల్ ఎత్తులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలు, కార్మికుల ముందు ఉంచుతోంది. కేంద్రంలోని బిజెపి, హోంమంత్రి అమిత్ షా పేరు చెప్పుకుంటూ జివిఎల్ పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఆయన 'సంక్రాంతి' సంబరాలు నిర్వహించడం పెద్ద చర్చనీయాంశమైంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ద్వారా లక్షలాది రూపాయలు స్పాన్సర్ షిప్ చేయించుకున్నట్లు సమాచారం. ఎస్‌బిఐపైనే కాకుండా మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలపైనా ఒత్తిడి తెచ్చి లక్షలాది రూపాయలు చందాల రూపంలో వసూలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కాలంలో హెచ్‌పిసిఎల్, హిందుస్థాన్ షిప్‌యార్డు, నేవల్ కమాండ్, స్టీల్‌ప్లాంట్, ఎన్‌టిపిసి సిఎమ్‌డిలు, ఎమ్‌డిలతో జివిఎల్ పలు దఫాలు చర్చలు జరపడంపైనా విమర్శలు వస్తున్నాయి.

12 నుంచి 15 వరకూ మహా సంక్రాంతి సంబరాలు

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మహా సంక్రాంతి సంబరాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలపై ఆర్థిక భారాన్ని రుద్దినట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. బీచ్ రోడ్డులో ఒక ఇంట్లో జివిఎల్ ఉంటూ పిఆర్‌ఒల వ్యవస్థ ద్వారా పలు కార్యకలాపాలు చేపడుతున్నారు. 2024 ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి బిజెపి తరపున బరిలో దిగుతున్నట్లు ఇప్పటికే తనకు తానే ప్రకటించుకున్నారు. అయితే, పలువురు బిజెపి సీనియర్ నాయకులు జివిఎల్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు.

సెట్టింగులకు రూ.60 లక్షలు పైనే...

సంక్రాంతి సంబరాలకు అయ్యే సెట్టింగుల ఖర్చే రూ.60 లక్షల మేరకు ఉంటుందని తెలుస్తోంది. రోజూ కల్చరల్ కార్యక్రమాల పేర జబర్దస్త్ టీముల సందడి, పల్సర్ బైక్ ఝాన్సీ ఆటలు, సినీ తారలను 14న తీసుకొచ్చి ఆటా పాట ఏర్పాటు చేశారు. వీటి ఖర్చంతా ఎస్‌బిఐపై రుద్దినట్లు సమాచారం.

జివిఎల్ అక్రమ చర్యలకు సిపిఎం ఖండన

ఎస్‌బిఐ సొమ్ముతో బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు సంక్రాంతి సంబరాలు నిర్వహించడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీవ్రంగా ఖండించారు. దీనిపై ఎస్‌బిఐ అధికారులు తక్షణమే ప్రజలకు సమాధానం చెప్పాలని, కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. తన రాజకీయ లబ్ధి కోసం ఎస్‌బిఐ సిఎస్ఆర్ నిధులను సంక్రాంతి సంబరాల పేరుతో జివిఎల్ దుర్వినియోగం చేశారని విమర్శించారు.

నా హత్యకు లోకేష్ కుట్ర

- రాయపాటి రంగారావు ఆరోపణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాను గత మూడు రోజులుగా టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌పై ఆరోపణలు చేయడంపై కొంతమంది తనను చంపుతామని బెదిరిస్తున్నారని మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు కుమారుడు రాయపాటి రంగారావు ఆరోపించారు. గుంటూరులోని తన నివాసంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

తన హత్యకు నారా లోకేష్ కుట్ర చేస్తున్నారని, టిడిపి నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపారు. తనకు ప్రాణహాని జరిగితే లోకేషే బాధ్యుడన్నారు. మంగళగిరిలో పద్మశాలీలతో తనకు పరిచయాలు ఉన్నాయని, లోకేష్ మంగళగిరిలో ఎలా గెలుస్తారో చూస్తానని సవాల్ విసిరారు. లోకేష్‌కు డబ్బు తప్ప రాజకీయాలు తెలియవని, టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రాజధాని పేరుతో జరుగుతున్న ఉద్యమం వెనుక ఒక కుంభకోణం ఉందన్నారు. తన సోదరి రాయపాటి శైలజ కూడా విరాళాలు వసూలు చేశారని ఆరోపించారు. వసూలు చేసిన నిధులు ఎటుపోయాయో చెప్పాలని ప్రశ్నించారు.


రంగారావు ఆరోపణలలో నిజంలేదు : శ్రీనివాస్, శైలజ

తన సోదరుడి కుమారుడు రాయపాటి రంగారావు చేస్తున్న ఆరోపణలతో తమ ఉమ్మడి కుటుంబానికి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. తన సోదరుడు రాయపాటి సాంబశివరావుతో కలిసి తామంతా ఉమ్మడి కుటుంబంగానే ఉన్నామని, రాజకీయంగా ఎదుగుదల కోసం రంగారావు ఆకస్మికంగా చంద్రబాబు, లోకేష్‌పై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటితో తమ కుటుంబ సభ్యులకు సంబంధం లేదన్నారు. అమరావతి జెఎసి నాయకురాలు రాయపాటి శైలజ మాట్లాడుతూ రాజధాని కోసం వసూలు చేసిన విరాళాలలకు ప్రతి పైసాకు లెక్కలున్నాయని, ఒక్క పైసా కూడా దుర్వినియోగం చేయలేదని చెప్పారు.

విశాఖ ఎయిర్‌పోర్టులో పలు విమానాలు రద్దు

- ప్రయాణికుల ఆందోళన

ప్రజాశక్తి -గోపాలపట్నం (విశాఖపట్నం)


విశాఖ విమానాశ్రయంలో ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ప్రతికూల వాతావరణం కారణంగా విశాఖ విమానాశ్రయంలో ఆదివారం పలు విమానాలు రద్దయ్యాయి. విశాఖ రావలసిన, విశాఖ నుంచి వెళ్లే ఢిల్లీ ఇండిగో, ఢిల్లీ ఎయిర్ ఇండియా, విజయవాడ ముంబయి, హైదరాబాద్, చెన్నై, ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలు రద్దయ్యాయి. దీంతో పండగపూట గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థల ప్రతినిధులతో వాగ్వావాదానికి దిగారు. తమకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఆందోళన చేశారు.


సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేస్తున్న భువనేశ్వరి, వసుంధర, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

నారావారిపల్లెలో సంక్రాంతి శోభ

- హాజరైన చంద్రబాబు, లోకేష్‌కు ఘన స్వాగతం
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

ప్రజాశక్తి- రామచంద్రపురం

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండగను మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లెలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన, నారా లోకేష్ ఏ.రంగంపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు, లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నారా దేవాన్ష్ రెండు రోజుల క్రితమే నారావారిపల్లెకు చేరుకున్నారు. చిత్తూరు జిల్లా టిడిపి పార్లమెంటు అధ్యక్షులు, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించి, ఆరోగ్యం గురించి నారా లోకేష్ అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ జిఒలు దగ్ధం

నారావారిపల్లెలో భోగి మంటల్లో ప్రభుత్వ జిఒలు దగ్ధం చేశారు. జిఒ నంబర్ 1, ఎస్మా, ఇన్నర్‌రింగ్ రోడ్డు, లికర్స్, శాండ్, స్కిల్ డెవలప్‌మెంట్ ఎఫ్‌ఐఆర్ కాపీలను నందమూరి వసుంధర, రామకృష్ణ, పులివర్తి సుధారెడ్డి, చంద్రబాబు సోదరి హైమావతి దగ్ధం చేసి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరిదాసు కీర్తనలు, ముగ్గుల పోటీలు, ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది.



అలరించిన పశువుల పండగ

- జనసంద్రంగా అనుపల్లి

ప్రజాశక్తి-రామచంద్రపురం

సంక్రాంతి పండగ సందర్భంగా తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లి గ్రామంలో పశువుల పండగ (జల్లికట్టు) అలరించింది. ఈ కార్యక్రమానికి పశువుల యజమానులు తమ కోడె గిత్తలు, పశువుల కొమ్ములకు రంగులు పూసి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం పశువుల కొమ్ములకు తమ అభిమాన రాజకీయ, సినిమా నటుల ఫొటోలతో చెక్క పలకలు తయారు చేసి, వివిధ రకాల రంగు కాగితాలతో, నెమలి ఈకలతో అలంకరించి పశువుల కొమ్ములకు కట్టారు. మధ్యాహ్నం ఒంటిగంటకు జల్లికట్టును ప్రారంభించారు. పశువులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. జల్లికట్టును తిలకించేందుకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు.

హైదరాబాద్ ఖాళీ

- బోసిపోయిన రహదారులు
- తాత్కాలికంగా మూతపడ్డ దుకాణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగింట పెద్ద పండగ సంక్రాంతికి భాగ్యనగరం హైదరాబాద్ ఖాళీ అయింది. నగర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బతుకు జీవులు సొంతూళ్లకు వెళ్లడంతో రోడ్లన్నీ బోసిపోయాయి. నిత్యం రద్దీగా ఉంటే కూకట్‌పల్లి, నిజాంపేట, కొండాపూర్, మాదాపూర్, జీడిమెట్ల, ఇసిఐఎల్, ఎల్‌బినగర్, మల్కాజ్‌గిరి, తదితర ప్రాంతాల్లో జన సంచారం తగ్గింది. హోటళ్లు, షాపింగ్ మాల్స్ వెలవెలబోతున్నాయి. గిరాకీ లేకపోవడంతో పలు దుకాణాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి, రైల్వే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా అవి ఏమాత్రమూ సరిపోవడం లేదు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఒంగోలు, రాజమండ్రి, విశాఖ, నెల్లూరు పట్టణాలకు వెళ్లేందుకు ప్రయివేటు ట్రావెల్స్ మూడింతల అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఆదివారం కూడా హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. పంతంగి టోల్‌గేట్ వద్ద కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో తెలంగాణ పల్లెలు పండగ శోభ సంతరించుకున్నాయి. ఆంధ్ర శివారు ప్రాంతాల్లో కోడి పందేలు, పొటేళ్ల పందేలు నిర్వహించారు.

అధిష్టానం నిర్ణయం మేరకు పోటీ : గంటా

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

టిడిపి అధిష్టానం ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవిపి కాలనీలోని తన ఇంటి వద్ద భోగి మంటలు వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న దానిపై పార్టీ అధిష్టానానికి, తనకు ఒక క్లారిటీ ఉందన్నారు. వైసిపి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు బయటకు వచ్చి చేస్తున్న వ్యాఖ్యలను చూస్తే ఆ పార్టీ మునిగిపోతున్న పడవ అని గత కొన్ని రోజులుగా స్పష్టమవుతోందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి పెట్టిన ఆంక్షలు, ఇబ్బందులను వారు ఏకరువుపెడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కలయికతో జయకేతనం ఎగురవేసి ప్రజలకు సుభిక్ష పాలన అందుతుందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పోలవరం పనులు ఒక్క శాతం కూడా జరగలేదని విమర్శించారు. విశాఖపట్నం టూరిజం, భోగాపురం ఎయిర్‌పోర్టు, కర్నూలు న్యాయ రాజధాని తదితర హామీలేమీ నెరవేర్చకుండా 98.5 శాతం మేనిఫెస్టో హామీలను పూర్తిచేశామని వైసిపి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

పండగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి - దొరవారిసత్రం (తిరుపతి జిల్లా)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని కలగుంట జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఏకొల్లు గ్రామానికి చెందిన గౌతమ్ (23), నాయుడుపేట మండలం అట్లపాలెం గ్రామానికి చెందిన మునిరత్నం (29), పెళ్లకూరు మండలం జీలగపాటూరు గ్రామానికి చెందిన కోగిలి రాంకి (24) ముగ్గురూ స్నేహితులు. సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గురు కలిసి ఏకోలు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై నాయుడుపేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దొరవారిసత్రం మండల పరిధిలోని కలగుంట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గౌతమ్, రాంకి అక్కడికక్కడే మరణించారు. తీవ్రగాయాలైన మునిరత్నంను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయనా మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలల్లో సిబ్బంది కొరత తీవ్రం

- ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానంతో బహిర్గతం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు వైద్య కళాశాలల్లో తీవ్ర సిబ్బంది కొరత ఉన్నది. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానంతో ఈ విషయం వెల్లడైంది. ఫ్యాకల్టీ సభ్యుల 75 శాతం హాజరును నిర్ధారించటంలో విఫలమైనందుకు గానూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గత నెలలో భారతలోని దాదాపు సగం వైద్య కళాశాలకు నోటీసులు పంపింది. తక్కువ వైద్య కళాశాలలు కలిగిన రాష్ట్రాలు కూడా అత్యధిక హాజరులేమిని కలిగి ఉండటం గమనార్హం. అపెక్స్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్‌లోని వర్గాలు ఆన్‌లైన్ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్‌పై నివేదించిన హాజరులో కొరత చాలా ఎక్కువగా ఫ్యాకల్టీ కొరత కారణంగానే ఉన్నదని పేర్కొనటం గమనార్హం. "అధ్యాపకుల హాజరును ఆన్‌లైన్‌లో గుర్తించడం తప్పనిసరి చేయబడింది. 2020 నుంచి నిబంధనలు ఉండగా, గతేడాది నుంచి అమలు చేయడం ప్రారంభమయ్యాయి. కాలేజీల్లో ఫ్యాకల్టీ ఉండే వారు ఎందుకు హాజరుకారు. కళాశాలలకు అవసరమైన అధ్యాపకులు లేకపోవటం కారణంగానే హాజరు తక్కువగా ఉన్నది" అని ఒక అధికారి తెలిపారు. అయితే, అధ్యాపకుల సంఖ్యలో కొరత వాస్తవంగా ఉంటే.. కళాశాలలు ఈ లోపాన్ని తీర్చడానికి కఠినమైన సమయాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు అంటున్నారు.



గబ్బిలాల నుంచి మానవులకు సోకే కొత్త వైరస్..!

జెనీవా : గబ్బిలాల నుంచి మానవులకు సోకే ప్రమాదం ఉన్న మరో కొత్త వైరస్‌ను థాయ్‌లాండ్‌లో గుర్తించినట్టు న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఎకోహెల్త్ అలయన్స్' అనే పరిశోధనా సంస్థ తెలిపింది. దీన్ని ఇంతకు ముందెప్పుడూ చూడలేదని జీవిల జరిగిన 'ప్రపంచ ఆరోగ్య సంస్థ సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ పీటర్ దస్జాక్ వెల్లడించారు.

డిసెంబర్‌లో 10 వేల కరోనా మరణాలు..!

గత నెలలో ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు పెరిగిన సంగతి విదితమే. డిసెంబర్‌లో దాదాపు 10 వేల మరణాలు నమోదయ్యాయని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. కొత్త ఉపవేరియంట్ జెఎన్.1 వ్యాప్తితోపాటు సెలవుల నేపథ్యంలో ప్రజలు గుమిగూడడమే అందుకు కారణమని వివరించింది. ఈ నేపథ్యంలో సంస్థ నిర్వహించిన అత్యవసర సమావేశంలో పీటర్ కొత్త వైరస్ గురించి వెల్లడించారు.

కరోనా స్థాయిలో వ్యాపించే సామర్థ్యం

కరోనా స్థాయిలో వ్యాపించే సామర్థ్యం తాజాగా గుర్తించిన కొత్త వైరస్‌కు ఉందని పీటర్ తెలిపారు. థాయ్‌లాండ్‌లో ఓ గుహలోని గబ్బిలాల్లో దీన్ని గుర్తించినట్లు చెప్పారు. స్థానిక రైతులు ఈ గుహ నుంచి గబ్బిలాల ఎరువును పంట పొలాల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఎరువులోనే ఆ వైరస్ ఉన్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మనుషులతో తరచూ కాంటాక్ట్‌లోకి వస్తున్న ఈ వైరస్ భవిష్యత్‌లో ఆత్యవసర పరిస్థితులను తీసుకొచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో నష్ట పరిహారం పెంపును పరిశీలించండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో నష్ట పరిహారం పెంచే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని జీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. 8 వారాల్లోగా ఈ విషయంపై తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. అలాగే గత కొన్ని సంవత్సరాలుగా హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరుగుతూ వస్తోందని, అయితే పరిహారం తీసుకుంటున్న బాధితుల సంఖ్య తక్కువగా ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. పరిహారం పథకం గురించి బాధితులకు తెలియకపోవడమే ఇందుకు ఒక కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది. నష్టపరిహారం పథకం గురించి బాధితుల కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సుప్రీంకోర్టు పోలీసులను కోరింది. అలాగే, 'డబ్బు విలువ కాలక్రమేణా తగ్గిపోతుంది. కాబట్టి నష్ట పరిహార మొత్తాలను ఏటా పెంచవచ్చే లేదో పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. ఎనిమిది వారాల్లోగా ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. మోటారు వాహనాల చట్టం 1988 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషనును జస్టిస్ ఎఎస్ ఓకా, పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో భూకంపం ..

రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ ఏరియాలో భూమి స్వల్పంగా కంపించింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.18 గంటల సమయంలో భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై తీవ్రత 3.1గా నమోదైందని సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి వుందని అధికారులు తెలిపారు.



చిన్నపెద్దా తేడాలేకుండా యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో గాయపడి ఖాన్ యూనిస్‌లోని నజీర్ ఆసుపత్రిలో చనిపోయిన చిన్నారి పాదాన్ని ముద్దాడుతున్న పాలస్తీనియన్



ఇజ్రాయిల్ దాడుల్లో తల్లిదండ్రులను కోల్పోవడమే గాక తాను కూడా రెండు కాళ్లు పోగొట్టుకొని అనాథగా మిగిలిన చిన్నారికి పాలు పడుతున్న యూరోపియన్ ఆసుపత్రికి చెందిన నర్సు..ఇజ్రాయిల్ దాడుల్లో వెయ్యి మంది పైగా చిన్నారులు తీవ్ర గాయాలతో వికలాంగులుగా మారారు.



పాలస్తీనియన్ పౌరులను బందీలుగా నిర్బంధించి వారి దుస్తులు విప్పేసి, పశువులను కుక్కినట్లు కుక్కి వాహనాల్లో తరలిస్తున్న ఇజ్రాయిల్ సైన్యం

గాజాలో అమానవీయతకు 100 రోజులు

- యుద్ధం మధ్యప్రాచ్యం అంతటా వ్యాపించింది
- లెబనాన్, ఇరాన్, యెమెన్లలో దాడులు
- ఎర్ర సముద్రం కూడా రణరంగంగా మారింది
- గాజాలో ప్రతి గంటకు 10 మంది చనిపోతున్నారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు



గాజాలో ఇజ్రాయిల్ జరిపిన క్షిపణి దాడుల్లో ధ్వంసమైన జబాలియా శరణార్థి శిబిరం.. అంతులేని దుఃఖంతో తలపట్టుకున్న పాలస్తీనియన్ పౌరుడు

గాజా : గాజా సామూహిక సమాధిగా మారి ఆదివారానికి సరిగ్గా100 రోజులు. ఇది ఈ శతాబ్దపు అత్యంత అమానవీయ చర్య. ఈ వంద రోజుల్లో 24వేల మంది దాకా పాలస్తీనీయులు చనిపోయారు. మరో 60,000 మంది దాకా క్షతగాత్రులయ్యారు. చనిపోయినవారిలో ఎక్కువ భాగం అభం శుభం తెలియని పిల్లలు, మహిళలే. ఆసుపత్రులు, క్రైస్తవ, ముస్లిం ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయెల్.. తాము గాజా నుంచి ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా లేమని అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుట చెప్పింది. అక్టోబర్ 7న హమాస్ దాడిని సాకుగా చూపి ఇజ్రాయెల్ ఏకపక్షంగా చేపట్టిన దురాక్రమణపూరిత దాడులు సాగిస్తోంది. గాజాలో రక్తపుటేరులు పారిస్తోంది. యూదు ఉన్మాది నెతన్యాహు ఈ యుద్ధాన్ని ఆత్మ రక్షణ చర్యగా పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ను యుద్ధ నేరస్తునిగా ప్రకటించాలని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. 76 ఏళ్లుగా పాలస్తీనా ప్రజలు ఇజ్రాయిల్ దాష్టీకాలకు, దురాక్రమణలకు గురవుతూనే ఉన్నారని దక్షిణాఫ్రికా ఆ పిటిషన్‌లో పేర్కొంది.

21వ శతాబ్దపు అత్యంత దారుణమైన మారణహోమానికి గాజా నగరం ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. జియోనిస్ట్ రాబందులు రక్తదాహంతో తిరుగుతున్నాయి. అ మెరికా ఈ రాబందులకు అన్ని రకాల మద్దతు ఇస్తున్నది. పశ్చిమ దేశాలు అండ చూసుకునే ఇజ్రాయిల్ ఇష్టానుసారంగా చెలరేగిపోతోంది. రాక్షస దాడులను యథేచ్ఛగా సాగిస్తోంది.. గాజాలో కాల్పుల విరమణకు అంతర్జాతీయ సమాజం ముక్త కంఠంతో చేస్తున్న డిమాండ్‌ను యుద్ధోన్మాది నెతన్యాహు బేఖాతరు చేస్తున్నాడు. ప్రపంచం భయపడుతున్నట్టే ఈ యుద్ధం మధ్యప్రాచ్యం అంతటికీ విస్తరిస్తోంది. లెబనాన్, ఇరాన్, యెమెన్‌లపై సామ్రాజ్యవాద అమెరికా, బ్రిటన్ తాజాగా వైమానిక దాడులకు దిగాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఎర్ర సముద్రం , హిందూ మహాసముద్రం కూడా రణరంగంగా మారాయి. ఇరాన్ మద్దతుతో యెమెన్ హౌతీలు ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్ అనుబంధ నౌకలపై దాడి చేశారు. యెమెన్‌లోని హౌతీ స్థావరాలపై అమెరికా, బ్రిటన్ శుక్రవారం పెద్దయెత్తున వైమానిక దాడులు ప్రారంభించాయి.ఇది మున్ముందు ఎటువంటి మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి.

చెన్నై, బెంగళూరును కమ్మేసిన పొగ మంచు

న్యూఢిల్లీ : చెన్నై, బెంగళూరు నగరాలను ఆదివారం ఉదయం నుంచి దట్టమైన పొగ మంచు కమ్మేసింది. దీంతో రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా విమానయానానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ రెండు విమానాశ్రయాల నుంచి అనేక విమానాలను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. చెన్నై విమానశ్రయం నుంచి 14 విమాన సర్వీసులను రద్దు చేశామని, ఐదు విమానాలను దారి మళ్లించామని, మరో 17 విమానాలు ఆలస్యంగా నడిచాయని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 4:30 గంటల నుంచి 7:50 గంటల వరకూ పూర్తిగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకున్నాయని, దృశ్యమానత 100 మీటర్ల లోపునకు దిగజారిందని అధికారులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కూడా అనేక విమానాలు రద్దు చేయడం లేదా దారి మళ్లించడం చేశారు. ఢిల్లీకి వెళ్లవలసిన ఏడు విమాన సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. చెన్నైకు వెళ్లవలసిన ఒక విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు. పొగమంచు కారణంగా ఆదివారం 44 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు.

తైవాన్ ఎన్నికలపై అమెరికా వ్యాఖ్యలకు చైనా ఖండన



బీజింగ్ : తైవాన్ ఎన్నికలపై అమెరికా చేసిన వ్యాఖ్యలను చైనా తీవ్రంగా ఖండించింది. తైవాన్ అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (పిడిపి)కి చెందిన లాయ్ చింగ్-టె విజయం సాధించడాన్ని తైవాన్ స్వాతంత్ర్యానికి మొగ్గ చూపిస్తున్నట్లుగా వర్ణిస్తూ శనివారం అమెరికా అభినందనలు తెలిపింది. అమెరికా ప్రకటనపై ఆదివారం చైనా విచారం వ్యక్తం చేసింది. తైవాన్ ఎప్పటికీ చైనాలో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'అమెరికా ప్రకటన తైవాన్‌లోని వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాన్ని పంపుతుంది' అని పేర్కొన్నారు. అమెరికా ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నాం, గట్టిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, అమెరికా ప్రకటన 'ఒకే చైనా సూత్రం'ను ఉల్లంఘిస్తుందని, తైవాన్‌తో కేవలం అనధికార సంబంధాలను మాత్రమే కొనసాగించాలని అమెరికాకు చైనా విజ్ఞప్తి చేసింది. తైవాన్‌తో అధికారిక జోక్యాన్ని నిలిపివేయాలని, తైవాన్‌లో వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాలను ఇవ్వడం మానుకోవాలని అమెరికాను గట్టిగా హెచ్చరించారు.

నేటి నుంచి కేరళలో మెగా సైన్స్ పండుగ

- ప్రారంభించనున్న పినరయి
- వైజ్ఞానిక ప్రయోగాలు, సృజనాత్మక ఆవిష్కరణలు



తిరువనంతపురం : కేరళ రాజధాని తిరువనంతపురంలో సోమవారం నుంచి అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్ ప్రారంభం కాబోతోంది. శాస్త్రీయ అన్వేషణలు, ప్రకాశవంతమైన కళాత్మకతల మేళవింపుగా ఈ మెగా ఫెస్టివల్ జరగబోతోంది. రాజధాని శివారులోని బయో 360 లైఫ్‌సైన్స్ పార్కులో సాయంత్రం ఆరు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి, సైన్స్ ఫెస్టివల్ చైర్మన్ కేఎన్ బాలగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకున్నదని చెప్పారు. దేశమంతటా శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాపింపజేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన తెలిపారు. వైజ్ఞానిక ప్రయోగాలు, సృజనాత్మక ఆవిష్కరణలతో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ వార్షిక జాతీయ కార్యక్రమ నిర్వహణ కోసం ఐదు కోట్ల రూపాయలు అందించేందుకు సైన్స్ కాంగ్రెస్ నిరాకరించిందని చెప్పారు.

రెండున్నర లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ఆసియాలోనే అసాధారణ కార్యక్రమం. శాస్త్ర సాంకేతిక శాఖ, శాస్త్ర సాంకేతిక పర్యావరణ రాష్ట్ర మండలి, ప్రభుత్వేతర స్వచ్ఛంద ట్రస్ట్ అమ్యూజియమ్ ఆర్ట్ సైన్స్ సంయుక్తంగా ఈ మహా ఈవెంట్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలు, విభాగాలు 'లైఫ్ సైన్స్' థీమ్‌తో సందర్శకులకు మంచి అనుభవాన్ని అందించబోతున్నాయి. ఈ ఉత్సవ నిర్వహణ కోసం అమెరికా కాన్సులేట్ జనరల్, బ్రిటీష్ కౌన్సిల్, జర్మన్ కాన్సులేట్, అలయన్స్ ఫ్రాంఛైజ్, తిరువనంతపురంలోని ఐఐఎస్ఈఆర్, సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్‌టీ, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం వంటివి విరాళాలు అందజేశాయి.

బ్రిటన్‌కు చెందిన ఇన్‌స్టలేషన్ కళాకారుడు రూపొందించిన 'మ్యూజియం ఆఫ్ మూన్', 'మార్స్', మెల్‌బోర్న్ యానిమేటర్ డ్రా బెర్రీ రూపొందించిన 'మాలెక్యులర్ యానిమేషన్', డాక్టర్ డగ్లస్ హెర్మన్ రూపొందించిన 'వాటర్ మ్యాటర్స్', బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య మ్యూజియం రూపొందించిన సీడ్స్ ఆఫ్ కల్చర్' వంటివి ఈ ఉత్సవానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.

సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించే చర్చా గోష్టుల్లో నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ మార్టన్ పి. మెల్డల్, చెన్నయ్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్, డాక్టర్ మధులిక గుహతాకుర్తా, డెనైస్ హిల్ (నాసా), డాక్టర్ రాబర్ట్ పోట్స్ (మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ), ప్రొఫెసర్ మైకెల్ విల్సన్ (లౌబరో యూనివర్సిటీ), డాక్టర్ సురేష్ సి పిళ్లై (అట్లాంటిక్ టెక్నలాజికల్ యూనివర్సిటీ), డాక్టర్ రాజీవ్ పట్టాథిల్ (రూథర్‌ఫర్డ్ యాపిల్టన్ లేబొరేటరీ), కనిమొళి (ఎంపీ), డాక్టర్ రాజేంద్ర సింగ్ (మెగసెసే అవార్డు గ్రహీత), మాలినీ వి శంకర్ (ఇండియన్ మారీటైమ్ యూనివర్సిటీ) పాల్గొంటారు.

16న ఎస్‌కెఎం జాతీయ సదస్సు

- డిమాండ్ల సాధన కోసం జలంధర్‌లో నిర్వహణ
- ఇప్పటికే ఇంటింటి ప్రచారం ప్రారంభం
- 12 కోట్ల కుటుంబాలతో నిమగ్నమవ్వాలని లక్ష్యం

న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఈనెల 16న జలంధర్‌లో తన జాతీయ సమావేశాన్ని నిర్వహించనున్నది. ఈ సమావేశానికి సంబంధించిన ప్రాథమిక అజెండాలో కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) కోసం పోరాటానికి తదుపరి దశలను ప్లాన్ చేయటం, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుంచి ఒకేసారి రుణమాఫీ, విద్యుత్ (సవరణ) చట్టం ద్వారా విద్యుత్ రంగ ప్రయివేటీకరణను వ్యతిరేకించటం వంటివి ఉన్నాయి.

లఖింపూర్ ఖేరీలో నలుగురు రైతులు, ఒక జర్నలిస్టు హత్య కేసులో హస్తమున్న తన కుమారుడు ఆశిష్ మిశ్రాను రక్షించటంలో పాత్ర పోషించినందుకు కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి అజయ్ మిశ్రాను సస్పెండ్ చేయాలని ఎస్కేఎం డిమాండ్ చేసింది. రైతుల డిమాండ్లపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు దాదాపు 12 కోట్ల కుటుంబాలతో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో ఎస్కేఎం ఇప్పటికే ఇంటింటికి చేరుకునే ప్రచారాన్ని ప్రారంభించింది.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించేందుకు కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం, రైతు సంఘాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇప్పుడు రద్దు చేయబడిన వ్యవసాయ చట్టాలను సమర్థించిన మార్కెట్ అనుకూల నిపుణులను చేర్చిన తర్వాత ప్యానెల్‌లో భాగం కావటానికి వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని సంఘాలు గతంలో తిరస్కరించాయి.

2021, డిసెంబర్ 9న మోడీ ప్రభుత్వ లిఖితపూర్వక హామీతో.. 2021 నవంబర్ 26న ఢిల్లీ సరిహద్దుల్లో 735 మంది రైతులు అమరులైన 13 నెలల చారిత్రక రైతాంగ పోరాటాన్ని రైతులు ఆపేశారని ఎస్కేఎం వివరించింది. "పూర్తి రెండు సంవత్సరాలు గడిచాయి. అయితే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టేందుకు 'మోడీ కా గ్యారంటీ' అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రధానికి ఎంఎస్‌పీతో సహా రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయనందున కేంద్రానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదు. ఎమ్ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన చట్టపరమైన హామీతో అన్ని పంటలకు, రైతులు, రైతు కార్మికుల రుణాలను మాఫీ చేయాలి. విద్యుత్ ప్రయివేటీకరణను, పొలాలు, రైతుల ఇండ్లకు స్మార్ట్ మీటర్లను పెట్టడం ఆపాలి" అని పేర్కొన్నది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కార్పొరేట్ లాభాదాయకత కోసమేనని వివరించింది.

కాలుష్య కోరల్లో దేశ రాజధాని ప్రాంతం

- నిర్మాణ పనులు, వాహనాల రాకపోకలపై ఆంక్షలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ప్రాంతం..న్యూఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్య రక్కసి కోరలు చాచింది. గాలి నాణ్యత అధ్వాన్న స్థాయిలకు క్షీణించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతాల్లో అత్యవసరం కాని నిర్మాణ పనులను, కాలుష్య కారకాలను వెదజల్లే బిఎస్-3 పెట్రోల్, బిఎస్-4 డిజిల్ ఆధారిత వాహనాల రాకపోకలపై నిషేధం విధించింది. గాలి నాణ్యత యాజమాన్య సంస్థ వివరాల ప్రకారం ఢిల్లీ యొక్క గాలి నాణ్యత సూచి (ఎక్యూఐ) ఆదివారం ఉదయం 10 గంటలకు 458 పాయింట్లుగా నమోదైంది. మరికొంత కాలం పాటు గాలినాణ్యత ఇదే విధంగా ఉంటుందని కమిషన్ అంచనా వేసింది. గాలి నాణ్యత మరింత క్షీణించకుండా ఉండటానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) స్టేజ్-3ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జాతీయ భద్రత లేదా రక్షణ, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులు, ఆరోగ్య సంరక్షణ, రైల్వేలు, మెట్రో రైలు, విమానాశ్రయాలు, అంతర్ రాష్ట్ర బస్ టెర్మినల్స్, హైవేలు, రోడ్లు, ఫ్లై ఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిలు, విద్యుత్ ప్రసారం- పైప్‌లైన్లు, పారిశుద్ధ్యం, నీటి సరఫరాకు సంబంధించిన నిర్మాణ పనుల మినహాయించి..మిగిలిన అత్యవసరం కిందకు రాని అన్ని నిర్మాణ పనులపైనా నిషేధం విధించింది.

ఆధ్యాత్మిక రంగాల్లో రాజకీయ జోక్యం తగదు

- పూరి శంకరాచార్య

న్యూఢిల్లీ : మతపరమైన, ఆధ్యాత్మిక రంగాల్లో రాజకీయ జోక్యం ఆమోదయోగ్యం కాదని, రాజ్యాంగం కూడా ఈ విధానాన్ని అనుమతించదని పూరి శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి వ్యాఖ్యానించారు. జనవరి 22న అయోధ్యలో నిర్వహించే ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి తాను హాజరుకానని మరోసారి స్పష్టం చేశారు. శనివారం పశ్చిమబెంగాల్‌లోని గంగాసాగర్ మేళాలో మకర సంక్రాంతి సందర్భంగా పుణ్యస్నానాల్లో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా పూరీ శంకరాచార్య మీడియాతో మాట్లాడారు. పీఠాధిపతిగా తాను ఎక్కడికి వెళ్లాలి, ఏ విషయంలో జోక్యం చేసుకోవాలి. ఏమి తినాలి అనే విషయాల్లో కొన్ని పరిమితులు ఉంటాయని చెప్పారు. " రాజకీయ నేతలకు పరిమితులు ఉన్నాయి. రాజ్యాంగం ప్రకారం వారికి నిర్దిష్టమైన బాధ్యతలు ఉంటాయి. మతపరమైన, ఆధ్యాత్మిక రంగాలకు కూడా నియమాలు, పరిమితులు ఉన్నాయి. వాటిని అనుసరించాల్సి వుంటుంది. రాజకీయ నేతలు ప్రతి రంగంలోనూ జోక్యం చేసుకోవడం పిచ్చితనం. రాజ్యాంగం ప్రకారం ఇది క్రూరమైన నేరం" అని అన్నారు.

విగ్రహ ప్రతిష్టకు సంబంధించినంతవరకు గ్రంధాల ప్రకారం కొన్ని నిర్దిష్ట నియమాలు ఉన్నాయని, దేశాధ్యక్షుడైనా, ప్రధాని అయినా సరే వాటిని పాటించాల్సిందేననిస్పష్టం చేశారు. ప్రచారం కోసం ఈ నిబంధనలను అతిక్రమించడం తిరుగుబాటు చర్య అవుతుందని అన్నారు. ఆగస్ట్ 22న జరగనున్న రామమందిర ప్రారంభోత్సవానికి హాజరయ్యే విషయంలో నలుగురు శంకరా చార్యుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఆ కార్యక్రమానికి హాజరుకాకుండా తాను ఎవరినీ ఆపేది లేదని స్పష్టం చేశారు.

షిండే శివసేన గూటికి మిలింద్ దేవరా

ముంబయి : మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, రాహుల్ గాంధీ సన్నిహితునిగా భావించే మిలింద్ దేవరా ఆ పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. అనంతరం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతత్వంలోని శివసేన పార్టీలో చేరారు. ప్రతిదాన్ని వ్యతిరేకించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని, షిండే అందరికీ అందుబాటులో ఉండే నేతగా ఎదిగారని ఈ సందర్భంగా దేవరా పేర్కొన్నారు. అంతకుముందు కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ఆయన పేర్కొన్నారు. 'రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన ముగింపు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాను. పార్టీతో మా కుటుంబానికి 55 ఏళ్ల బంధాన్ని ముగించాను. ఇన్ని ఏళ్లుగా పార్టీలో మద్దతుగా నిలిచిన నాయకులకు, సహచరులకు, కార్యకర్తలకు కతజ్ఞతలు' అని ఆయన తెలిపారు.

ముంబయి సౌత్ లోక్‌సభ స్థానం నుంచి మిలింద్ కాంగ్రెస్ తరుపున ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 2004, 2009 ఎన్నికల్లో గెలుపొందారు. కానీ 2014, 2019 ఎన్నికల్లో శివసేన నేత ప్రమోద్ సావంత్ చేతిలో ఓటమిపాలయ్యి రెండో స్థానానికి పరిమితమయ్యారు. ఈ దఫా 'ఇండియా' ఫోరం సీట్ల సర్దుబాటులో భాగంగా సౌత్ ముంబయి లోక్ సభ స్థానాన్ని శివసేన (యుబిటి)కి కేటాయించే అవకాశముందన్న కథనాల నేపథ్యంలో దేవరా కాంగ్రెస్‌ను వీడారు.

ప్రధాని నిర్ణయించిన సమయానికే ..

మిలింద్ రాజీనామాపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఘాటుగా స్పందించారు. ప్రధాని మోడీ నిర్ణయించిన సమయానికే మిలింద్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మిలింద్ తండ్రి మురళీ దేవ్‌రా ఎప్పుడూ కాంగ్రెస్ పక్షపాతిగానే ఉన్నారని గుర్తు చేశారు. మిలింద్ తనతో గత శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారని, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యుటిబి) దక్షిణముంబయి లోక్‌సభ స్థానాన్ని కేటాయిస్తారన్న వార్తపై రాహుల్ గాంధీతో మాట్లాడాలని అభ్యర్థించారు. అప్పుడే మిలింద్ పార్టీ నుండి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారని, అయితే రాజీనామా సమయాన్ని మాత్రం ప్రధాని మోడీ నిర్ణయించారని జైరాం వ్యాఖ్యానించారు.

మా దేశంలో భారత సైన్యం వద్దు

- మార్చి 15లోగా ఉపసంహరించుకోవాలి
- మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు

న్యూఢిల్లీ : మాల్దీవుల్లో మార్చి 15లోగా భారత సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు గడువు విధించారు. ఈ విషయాన్ని ఆ దేశ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ తాజా లెక్కల ప్రకారం మాల్దీవుల్లో 88 మంది భారత సైనిక సిబ్బంది ఉన్నారు.

ప్రెసిడెంట్ ఆఫీసులోని పబ్లిక్ పాలసీ సెక్రెటరీ అబ్దుల్లా నజీమ్ ఇబ్రహీం మాట్లాడుతూ.. మార్చి 15 లోగా తన సైనిక సిబ్బందిని వెనక్కి తీసుకోవాలని ప్రెసిడెంట్ ముయిజ్జు అధికారికంగా భారతదేశాన్ని కోరారన్నారు. దళాల ఉపసంహరణపై చర్చలకు మాల్దీవులు, భారత్ ఉన్నత స్థాయి కోర్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాయి. ఈ బృందం ఆదివారం ఉదయం మాలేలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంలో మొదటి సారి సమావేశమైంది. దీనికి భారత హైకమిషనర్ మును మహవార్ కూడా హాజరయ్యారు.

'లక్షద్వీప్' పర్యాటకాభివృద్ధి ఉత్తుత్తిదే!

- విదేశీ చిత్రాలతో బిజెపి పెద్దల బడాయి ప్రచారం
- 'ఆల్ట్‌న్యూస్' పరిశోధనలో బయటపడ్డ బండారం

న్యూఢిల్లీ : ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్షద్వీప్‌లో పర్యటించి, అక్కడి చిత్రాలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన తర్వాత ఆ దీవులకు విపరీతమైన ప్రచారం లభించింది. అనేక మంది లక్షదీవులను మాల్దీవులతో పోల్చడంతో వివాదం కూడా చెలరేగింది. మోడీ లక్షద్వీప్ పర్యటన అనంతరం ఆయనకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను మాల్దీవుల ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంతో ఇప్పుడు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే పలువురు బిజెపి అగ్ర నాయకులు, కేంద్ర మంత్రులు, సంఘ్ పరివార్ ప్రముఖులు లక్షదీవుల అందాలు చూడతరమా! అంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం గుప్పిస్తున్నారు. మోడీ సర్కార్ కృషితో లక్షదీప్ కొత్త సొబగులు అద్దుకుందంటూ, పర్యాటకాభివృద్ధి పరుగులు పెడుతోందంటూ గొప్పగా ప్రచారం చేస్తున్నారు. అండమాన్ నికోబార్ దీవులు, పోర్ట్ బ్లెయిర్ చిత్రాలుగా సామాజిక మాధ్యమాల్లో కొన్నింటిని షేర్ చేశారు. కానీ అవన్నీ మన దేశంలోని పర్యాటక స్థలాల చిత్రాలేనా అనే విషయంపై 'ఆల్ట్ న్యూస్' పోర్టల్ కూపీ లాగగా బండారం బయటపడింది.

అవన్నీ విదేశీ చిత్రాలే

- లక్షదీవుల ఫొటోలు అని చెబుతూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు రెండు చిత్రాలను షేర్ చేసి, ఆ తర్వాత వాటిని తొలగించారు. నటుడు రణవీర్ సింగ్ కూడా ఓ ఫొటోను షేర్ చేసి, దేశంలో బీచ్ ప్రదేశాలు ఎక్కడెక్కడ ఉన్నాయో చెప్పాలంటూ నెటిజన్లను కోరారు. అయితే ఆయన కూడా ఆ తర్వాత ఆ ఫొటోను తొలగించారు. బిజెపి ఎంపీ రవి కిషన్, క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా కొన్ని సందర్శక స్థలాల ఫొటోలను షేర్ చేశారు. తాము తక్కువ తినలేదన్నట్లు మితవాది అరుణ్ పుడుర్, బిజెపి నాయకుడు తాజీందర్ బగ్గా కూడా అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పోర్ట్ బ్లెయిర్ బీచ్ చిత్రాలను పోస్ట్ చేశారు.
- లక్షద్వీప్ చిత్రాలుగా కిరణ్ రిజిజు, అరుణ్ పుడుర్ చెబుతున్నవి అలామీ స్టాక్ వెబ్‌సైట్‌లో ఉన్న ఫొటోలు. అవి ఫ్రాన్స్ పొలినేసియాలోని బోరా బోరా దీవుల నుండి తీసినవి. డ్రీమ్స్‌టైమ్ వెబ్‌సైట్‌లో కూడా ఈ ఫొటోలు ఉన్నాయి. అవి ఫ్రాన్స్ పొలినేసియా చిత్రాలంటూ కింద రాశారు కూడా. ఇక అరుణ్ పుడుర్ షేర్ చేసిన మరో ఫొటోను గూగుల్‌లో 'రివర్స్ ఇమేజ్ సెర్చ్' విభాగంలో వెతకగా అది షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్‌లోనూ, అనేక స్టాక్ వెబ్‌సైట్లలోనూ దర్శనమిచ్చింది. వాస్తవానికి అది థాయిలాండ్‌లోని తోన్సాయ్ బీచ్.
- రణవీర్ సింగ్ షేర్ చేసిన ఫొటో విషయానికి వస్తే దానిని షట్టర్‌స్టాక్ వెబ్‌సైట్ నుండి అప్‌లోడ్ చేసినట్లు తేలింది. ఆ ఫొటో మాల్దీవులకు చెందినది. మరో చిత్రాన్ని రవి కిషన్, కిరణ్ రిజిజు, అరుణ్ పుడుర్ షేర్ చేశారు. ఆ చిత్రం 2013లో టాప్ డ్రీమర్ అనే మ్యాగజైన్‌లో ప్రచురితమైంది. ఆ ఫొటో కూడా మాల్దీవులకు చెందినదిగా తెలిపారు. ఈ ఫొటోనే 2012 మార్చి 21న మాల్దీవన్ అనే ఫేస్‌బుక్ పేజీలో కన్పించింది. అదే ప్రదేశంలో వేరే కోణం నుండి మరో చిత్రాన్ని 2012 ఏప్రిల్ 26న తీశారు. ఇది ఫ్లికర్ వెబ్‌సైట్‌లో కూడా కన్పించింది. 2011 నవంబర్ 14న ఈ చిత్రాన్ని తీశారని వెబ్‌సైట్ తెలిపింది.
- వీరేంద్ర సెహ్వాగ్ షేర్ చేసిన చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లోని ట్రావెల్ పేజీలో అప్‌లోడ్ చేశారు. ఫ్రెంచ్ పాలినేసిస్‌లోని బోరా బోరాలో ఈ చిత్రాన్ని తీశారు. అరుణ్ పుడుర్ షేర్ చేసిన మరో చిత్రం అబోడ్ స్టాక్ వెబ్‌సైట్‌లోనిది. ఇది థాయిలాండ్‌లోని పుకెట్ ప్రాంతానికి చెందిన ఫొటో. అరుణ్ పుడుర్ షేర్ చేసిన ఇంకో చిత్రం పింటరెస్ట్ నుండి తీసుకున్నది. ఈ చిత్రం కూడా థాయిలాండ్‌లోనిదే. బిజెపి నాయకుడు తాజిందర్ బగ్గా ఓ ఫొటోను షేర్ చేశారు. దీనిని స్టాక్ ఇమేజ్ వెబ్‌సైట్ షట్టర్‌స్టాక్ నుండి అప్‌లోడ్ చేశారని తేలింది. ఇది కూడా థాయిలాండ్‌లోని కో లైప్ బీచ్ ఫొటోయే. అరుణ్ పుడుర్ షేర్ చేసిన మరో ఫొటో అలామీ వెబ్‌సైట్ నుండి తీసుకున్నది. దీనిని 2017 మే 23న ఓ కంట్రిబ్యూటర్ ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ఫొటో ఇండోనేషియాలోని లెంబాన్‌గన్ దీవుల సమీపంలో హిందూ మహా సముద్రంలోనిదని తేలింది.

నేను సంక్రాంతిని. పాడిపంటలు ఇంటికొచ్చే వేళ ... ప్రజల ముఖాల్లో వెల్లివిరిసే కళాకాంతిని. బతుకు దారిలో పట్నమెళ్లిన పిల్లాపాపలు సొంత ఊరికి తిరిగి వస్తే- అమ్మల, అమ్మమ్మల ముఖాల్లో వెలిగిపోయే మురిపెపు కాంతిని. ఇళ్లకు, ముంగిళ్లకు, మనసున మూల మూలకూ ఆనందపు వెలుగులు ప్రసరించే అచ్చమైన ప్రకృతి పర్వదినాన్ని. అందరూ బాగుంటే నేనూ బాగుండే పండగని. మీ అంతరంగపు ఆవిష్కారాన్ని. మీ సంతోషాలకు పండగ రూపాన్ని.

సందడే సందడి



గణగణ మ్రోగే గంటలు
డూ డూ బసవన్న ఆటలు
హేమంతుని మంచు తెరలు
చలి దుప్పటి సరదాలు

భోగి మంటల భోగాలు
రేగి పండ్ల దీవెనలు
చిన్నారుల సరదాలు
పతంగుల సందడులు

హరిలోరంగ హరి కీర్తనలు
హరిదాసుల ఆగమనాలు
పగటి వేషగాళ్ళ హావభావాలు
పిట్టల దొరల చతురతలు

సంగిడి రాళ్ల ప్రదర్శనలు
గ్రామీణ క్రీడా పోటీలు
పడతుల రంగవల్లికలు
గొబ్బియెల్లో పాటలు

కోడిపందాల సరదాలు
కొత్త అల్లుళ్ల ముచ్చట్లు
ఆడపడుచుల మురిపాలు
పిండి వంటల విందు భోజనాలు

సంక్రాంతి సంతోషాలు
సకల వృత్తులకు సాయాలు
సంక్రాంతి కాంతులు
సందడి సందడి పల్లెలు

– మొర్రి గోపి, కవిటి, శ్రీకాకుళం జిల్లా,
88978 82202.



నేను గీసిన బొమ్మ



నందిని
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హవేళి ఘణపూర్, మెదక్ జిల్లా.

నేను గీసిన బొమ్మ



డి.నిఖిల్,
8వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సంక్రాంతి స్వాగతం!

పిల్లల్లారా,
పిల్లల గన్న తల్లుల్లారా...

అందరూ ఊరికి వచ్చేశారు కదా! మీరందరూ వస్తేనే ఊరికి ఆనందం. మీరంతా అడుగు పెడితేనే పల్లెకు కళకళల కాంతి. గలగలల సవ్వడి. మీరు అనుకుంటారు : 'సంక్రాంతి పండక్కి వచ్చాం' అని. నేను అనుకుంటాను, 'మీరు వస్తూ వస్తూ పండగనైన నన్నూ తీసుకొచ్చారని. నిజమే కదా, నేను వారాల్లోంచి, వర్జాల్లోంచి రాను. క్యాలెండర్ల తేదీల్లోంచి ఊడిపడను. జనం ఆనందంలోంచి పుడతాను. పిల్లల నవ్వుల్లోంచి పుడతాను. మీ మీ ఆటల, పాటల, మాటల సందళ్లలోంచి ఉదయిస్తాను. మీరంతా చల్లగా ఉన్నప్పుడు, సుఖసంతోషాలతో తుళ్లింతలవుతున్నప్పుడూ – పండగగా నేను జన్మిస్తాను. మీ ఆనందపు సందళ్లలో పరవశిస్తాను.

మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు – ఇక్కడ అక్కడ అని కాకుండా ఎక్కడెక్కడికో ఎగురుతూ పోయే, తుళ్లుతూ పోయే పిల్లల మాధుర్యపు మనసుల నిండా నేను పండగనై పరవళ్లు తొక్కుతాను. ఎక్కడ పాడిపంటలు పొంగిపొర్లుతాయో, ఎక్కడ రైతుల కష్టానికి తగు ప్రతిఫలం దక్కుతుందో, ఎక్కడ కష్టాలూ కన్నీళ్లూ కాపురం పెట్టవో, ఎక్కడ పాలకులు ప్రజారంజక పాలన సాగిస్తారో, ఎక్కడ పిల్లాపాపలు తూనీగల్లా, తువ్వాయిల్లా స్వేచ్ఛావిహారం చేస్తారో .. అక్కడక్కడ అంతా నేనై ఆనంద తాండవం చేస్తాను.

రండి పిల్లల్లారా ..

మీ వలె, మీతోనే ఊరంతా, వీధివీధి ఒకసారి కలియతిరిగి చూస్తాను. జనం కళ్లల్లో, మీ పరుగుల్లో నన్ను నేను చూసుకొని తరిస్తాను.

మెరక వీధిలో మరిడమ్మ ఇల్లు ఎంత కళకళలాడుతుందో! ఆమె ముఖం ఎంత ఆనందంతో వెలుగుతుందో ...! మూడేళ్ల తరువాత దుబయి నుంచి పిల్లలతో సహా కొడుకు వచ్చినందుకు కాబోలు ఆవిడ సంతోషం! మనవడు బంటీతో ఎంత మురిపెంగా ఆడుకుంటుందో... చిన్ననాటి తన బిడ్డల ఆటపాటలను తలచుకుంటోంది! బిడ్డలే కదా, తల్లులకు పండగ!

పెద్ద వీధిలో పాత్రుడు చిన్ననాటి స్నేహితులతో వెటకారాలాడుతున్నాడు. చిన్నప్పటి తమ అల్లరి పనులను జొన్నపొత్తు రేకుల్లా పొరపొరలుగా



వొలుచుకుంటూ తెరలు తెరలుగా నవ్వుకుంటున్నారు. బాల్య మిత్రుల కూడికే కదా, బలమైన పండగ. తులసమ్మ గారి రామలక్ష్మి ఎంత పొంగిపోతుందో ... మొట్టమొదటిసారి తన మనవళ్లకు భోగిపళ్లు పోస్తుందట. తంగేటి సుబ్బత్త మహానందంతో ఉబ్బి తబ్బిబ్బవుతోంది; అపార్థాలతో అలిగిన అల్లుడు ఈసారి కుటుంబ సమేతంగా పండక్కి వచ్చినందుకట ...

రామాలయం వీధి ఎడమ పక్క ఏడో ఇంటి ముంగిట పట్నం మనవరాలు పింకీ రథం ముగ్గు వేస్తోంది. అత్తయ్యలు, పెద్దమ్మలూ ఆశ్చర్యంతో మురిసిపోతూ, మెరుగు సలహాలు కురిపిస్తున్నారు. గాలి పటాలను సర్దుకుంటూ చింతచెట్టు వీధి పిల్లల గ్యాంగు పరుగులు తీస్తోంది. అన్న వెంటే వెళతానని నాలుగేళ్ల నవ్య పేచీ పెడుతోంది. పెద్ద మావయ్య చిన్న కొడుకు ఆ బుజ్జాయిని ఎత్తుకొని ఊరడిస్తున్నాడు. అనుబంధాల వారధి కదా పండగ అంటే ..!

కమ్యూనిటీ హాలు సెంటర్లో యువకులు కొందరు డిఎస్సీ నోటిఫికేషన్ ఎన్ని పోస్టులకు వస్తుందో అని తర్కించుకుంటున్నారు. చింతచెట్టు మొదట్లో కూచున్న రైతులు ధాన్యం కొనుగోళ్ల గురించి కబుర్లాడుకుంటున్నారు. మొన్నటి ఈదురు గాలులకు పడిపోయిన అరటితోట నష్టం గురించి కౌలు రైతు కన్నబాబు విచారిస్తున్నాడు. కష్టసుఖాల నెమరువేత కూడా జీవితంలో భాగమే మరి!

ఊళ్లోకి విడత విడతలుగా వస్తూ ఉన్న సంక్రాంతి చుట్టాలను పేరు పెట్టి పలకరిస్తున్నాడు 70 ఏళ్ల పరంధామయ్య. ఎవరు ఎవరి తాలూకానో, ఏ ఏళ్లో ఉంటున్నారో, వాళ్ల వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో కొంచెం కొంచెంగా ప్రకటిస్తున్నాడు. 'ఇదే రావడమా, రాంబాబూ..' అని ఒక గడసరిని ఆరా తీస్తే, 'లేదు మాయ్యా .. వచ్చి మూడ్రోజులైంది. మీ ఇంటెనకాల దాక్కొని ఇప్పుడొస్తున్నాను.. నీ పెర్మీషను తీసుకుందామని...' అని జోకేశాడు ఆ మేనల్లుడి వరసకుడు. చింతచెట్టు మొత్తం హాయిగా నవ్వుకొంది. ఈ మాటల మెరుపులే కదా, పండగ!

సందడిని చూసి, హాయిగా నవ్వుకున్నాను నేను కూడా! కాసేపు అక్కడక్కడే తిరిగి, ఇంకొన్ని వీధుల్లో విహరించాను.

ఒకచోట ముగ్గులు ముద్దుముద్దుగా రంగుల నద్దుకుంటున్నాయి. ఇంకోచోట పిండివంటలు కమ్మకమ్మగా చవులూరిస్తున్నాయి. ఊరవతలి విశాల మైదానంలో ఆటలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఇంటా బయటా ఊరంతా సందళ్ల సోయగం. పిల్లల్లో పెద్దల్లో పండగ వ్యాపకాల సంరంభం.



అనేకమందిలోని ఆనందం, అనేకచోట్లలోని సంబరం– ఇంతింతై ... నేను పెద్ద పండగనై వెలుగొంది పోతున్నాను.

చివరాఖరిగా నాకు ప్రతిరోజూ చిరు పండగలా కనిపించే ఓ చిన్ని చోటు గుర్తొచ్చింది. అది గ్రామాల్లో చిన్ని చిన్ని పిల్లలు ఆటలు ఆడి, పాటలు పాడి ఆనందించే చోటు. అయ్యో ... కొత్త సందడిలో పడి నిత్య సందడిని మరిచానే ... అనుకొని, వడివడిగా అటు వెళ్లాను. ఆ చిన్నారుల బడికి తాళం వేసి ఉంది. *"40 రోజులు దాటింది... అంగన్వాడీ అమ్మలు ఆందోళన మొదలు పెట్టి. పాపం... ఈ పండగ కూడా లేదు వాళ్లకి. ప్రభుత్వం మొండిగానే పోతోంది."* అంటున్న సోములమ్మ మాటలు వినిపించాయి. పట్నం నుంచి వచ్చిన ఆమె కోడలు పద్మ నా వలె చెవివొగ్గి శ్రద్ధగా వింటోంది.

"అంగన్వాడీ బడి సాగినప్పుడు మన పిల్లలకు ఆటలుండేవి. పాటలుండేవి. ఇంత తిండి ఉండేది. ఈ నలభై రోజులూ ఆ సందడే లేకుండా పోయింది. చేస్తున్న పనికి తగ్గట్టు జీతం అడగటంలో తప్పేముంది? ఇందాక టీవీలో– 'అందరూ సంతోషంగా ఉండటమే పండగ' అన్నాడు ముఖ్యమంత్రి. మరి ఆ అందర్లో వేలాదిమందిగా ఉన్న అంగన్వాడీలు ఉండక్కర్లేదా?" అంటోంది సోములమ్మ. "అవును కదా.." అంది పద్మ.

అవును కదా!

అందరూ ఆనందంగా ఉంటేనే పండగ.

పాడిపంటలు పొంగి పొర్లి, గిట్టుబాటు ధర చేతికొచ్చి రైతులు; చదువులకు తగ్గ ఉద్యోగాలు వచ్చి యువతీ యువకులు; పనికి తగ్గ వేతనాలు చేతికంది ఉద్యోగులూ కార్మికులూ ... అందరూ సుఖసంతోషాలతో ఉండాలి! అప్పుడే నేను ఇంకా ఇంకా పెద్ద పండుగగా పరవశిస్తాను. పెద్ద వెలుగునై ప్రకాశిస్తాను.

అందరూ సంతోషంగా ఉండాలి.

ఆ సంతోషంలోంచి సంక్రాంతులు వెల్లువలా, వేకువల కువకువలలా ఎల్లడలా వెల్లివిరియాలి!

– సత్యాజీ



వెండితెరపై పండగ శోభ

ఏడాదంతా ఎదురుచూసే సంక్రాంతి పండుగ రానే వచ్చింది. పిల్లలు, పెద్దలతో లోగిళ్లన్నీ నిండిపోయాయి. ఊరంతా పండుగ వాతావరణం కనిపిస్తోంది. వెండితెరపై కూడా ఈ పండుగ ప్రతిబింబించేలా ఎన్నో సినిమాలు ప్రేక్షకులను అలరించాయి. భోగి మంటలు, కబడ్డీ పోటీలు, గాలి పటాలు ఎగరవేయడం, ముగ్గుల పోటీలు, హరిదాసు కీర్తనలు, పాడి, పంటలను ఇళ్లకు చేర్చుకోవడం ఇలా సంక్రాంతి పండగకి అనుసంధానంగా ఎన్నో సన్నివేశాలు పలు సినిమాల్లో కనిపించాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయ వస్త్రధారణలు, ఎద్దుల పోటీలు, కోడి పందేలను తమ సినిమాల్లో తప్పక జొప్పించేవారు చాలా మంది దర్శక, నిర్మాతలు. ఇక పండగ సందర్భంగా ఆడి, పాడిన పాటలు, నృత్యాలు సినిమాలో ప్రత్యేక ఆకర్షణ కూడా నిలిచాయి.

సంక్రాంతి పండగ, ప్రకృతి నేపథ్యంలో జరుపుకునే పెద్ద పండగ. వ్యవసాయం ఇతివృత్తంగా తెలుగు చిత్రసీమపై ఆనాటి నుండి నేటి వరకు అనేక చిత్రాలు వచ్చాయి. గతంలో ఈ ఒరవడి ఎక్కువగా ఉండేది. ఎన్టీఆర్, నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు ఇలా ఆ తరం నటీనటులు తమ సినిమాల్లో సంక్రాంతి పండగ వాతావరణం ఉండేలా చూసుకునే వారనడం అతిశయోక్తి కాదు.

వెండితెరపై సంక్రాంతి శోభ మొదలైంది 1949 నుండి అని చెప్పవచ్చు. ఆ ఏడాది వచ్చిన 'రక్ష రేఖ' చిత్రంలో 'గంగమ్మా! గంగమ్మా! పాలవెల్లి పొంగళ్లు, కమ్మ పాయసాలు పొంగే ఆరగింపు గంగమ్మ తల్లి..' అంటూ పండగ సందర్భంగా వచ్చే పాట ఉంది. అలాగే 1952లో 'సంక్రాంతి' అనే సినిమాలో 'జేజేలమ్మా జేజేలు.. సంక్రాంతి లక్ష్మికి జేజేలు..' అనే పాట అప్పట్లో విశేష ఆదరణ చూరగొంది. 1953లో వచ్చిన 'నా ఇల్లు' చిత్రంలో 'గొబ్బిళ్లో గొబ్బిళ్లో వచ్చేనమ్మా సంక్రాంతి..' అనే పాటలో సంక్రాంతి శోభను వర్ణించారు.



'ఉండమ్మా బొట్టు పెడతా' చిత్రంలో 'రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా..' అంటూ సాగే పాటలో సంక్రాంతి వాతావరణాన్ని, విశిష్టతను వర్ణించారు.





'ఏటేటా వస్తుంది సంక్రాంతి పండగ, బీదసాదలకెల్లా ప్రియమైన పండగా ఈనాటి సంక్రాంతి అసలైన పండగ, కష్టజీవులకది ఎంతో కన్నుల పండగ' అంటూ 'మంచి రోజులు వచ్చాయి' సినిమాలో నాగేశ్వరరావు ఆలపించిన యుగళ గీతం పండగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తుంది. కష్ట జీవులకి, రైతులకి ఈ పండగ ఎంత ముఖ్యమైనదో ఈ పాటలో వివరించారు.



నాగేశ్వరరావు, కృష్ణ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'ఊరంతా సంక్రాంతి' సినిమాలో 'సంబరాల సంకురాత్రి, ఊరంతా పిలిచింది..' అంటూ నాగేశ్వరరావు, జయసుధ, కృష్ణ, శ్రీదేవి జంటలు ఆడి పాడే యుగళగీతం పండగ శోభను కళ్ల ముందుంచుతుంది.

కృష్ణ హీరోగా వచ్చిన 'భోగి మంటలు' చిత్రంలో 'భోగుల్లో భోగుల్లో భోగ భాగ్యాల భోగుల్లో, భోగి మంటల భోగుల్లో.. ' అంటూ సాగే పాటలో పండగ వాతావరణం, అనుబంధాల గురించి చూపించారు.

కుటుంబ సభ్యులు, అక్కాచెల్లెళ్లు ఒక చోట చేరి సంబరాలు చేసుకునే ఈ సంక్రాంతి పండుగనాడు అనుబంధాలు, ఆత్మీయతలు వెల్లివిరిసేలా కనువిందు చేసిన ఎన్నో పాటలు వెండితెరపై అలరించాయి.

మోహన్‌బాబు హీరోగా వచ్చిన 'సోగ్గాడి పెళ్లాం' చిత్రంలో 'సంక్రాంతి వచ్చిందే తుమ్మెద, సరదాలు తెచ్చిందే తుమ్మెద..' పాట ఇప్పటికీ ప్రేక్షకుల నాలుకలపై నాట్యమాడుతుంది.

ఈ తరం హీరోల సినిమాల్లో పండుగ శోభ తగ్గిందనే చెప్పాలి. కమర్షియల్ సినిమాలు, పాన్ ఇండియా చిత్రాలు ఇబ్బడిముబ్బడిగా తెరకెక్కుతున్న ప్రస్తుత తరుణంలో అడపాదడపా కొంతమంది హీరోల చిత్రాల్లోనే పండుగ నేపథ్యాన్ని తెరకెక్కిస్తున్నారు.

శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన 'శతమానం భవతి' చిత్రంలో 'హైలో హైలెస్సా' అంటూ సాగే పాటలో సంక్రాంతి పండగ వాతావరణాన్ని చాలా అందంగా చూపించారు. 'శ్రీకారం' చిత్రంలో కూడా 'సంక్రాంతి సందళ్లో..' అంటూ ఓ పాట చాలా అందంగా తెరకెక్కించారు.

బాలకృష్ణ కథానాయకుడిగా వచ్చిన 'రూలర్' చిత్రంలో కూడా సంక్రాంతి నేపథ్య గీతం తెరకెక్కించారు.

వెంకటేష్, స్నేహ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'సంక్రాంతి' సినిమాలో 'డోలీ.. డోలీ.. డోలీ రే..'



అంటూ సాగే పాటలో కుటుంబమంతా కలసి ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకోవడం చూపించారు.

రామ్‌చరణ్ హీరోగా 'గోవిందుడు అందరివాడేలే' చిత్రంలో కూడా సంక్రాంతి నేపథ్య సన్నివేశాలు చూపించారు. సంక్రాంతికి విడుదలైన నాగార్జున హీరోగా వచ్చిన 'నా సామిరంగ' చిత్రంలో కూడా పండుగ వాతావరణం తెరకెక్కించారు.



అక్షర్ అదుర్స్

- **దూబే, జైస్వాల్ అర్ధసెంచరీలు**
- **రెండో టి20లో ఆఫ్ఘన్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు**
- **సిరీస్ 2-0తో భారత్ కైవసం**



దూబే (63 నాటౌట్)



అక్షర్ 4-0-17-2

ఇండోర్: తొలి టి20లో మెరిసిన శివమ్ దూబే.. రెండో టీ20లోనూ బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 32బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో అజేయంగా 63పరుగులు చేసి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. మరోవైపు యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్(68; 34బంతుల్లో 5ఫోర్లు, 6సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. దీంతో ఆఫ్ఘన్ నిర్దేశించిన 173పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 15.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి టీ20లో సత్తా చాటిన శివమ్ దూబే నేటి మ్యాచ్‌లోనూ విధ్వంసం సృష్టించాడు. టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (0) ఆడిన తొలి బంతికే డకౌట్ అయ్యాడు. ఇక విరాట్ కోహ్లీ 16 బంతుల్లో 5ఫోర్లతో చకచకా 29 పరుగులు చేశాడు. చివర్లో రింకూ సింగ్ 9 బంతుల్లో 9 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో కరీం జనత్‌కు రెండు, నవీనుల్ హక్, ఫజల్ హక్ ఫరూఖీకి ఒక్కో వికెట్ దక్కాయి.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ గుల్బదిన్ నాయబ్ (57; 35బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్లు)కి తోడు నజీబుల్లా జద్రాన్(23), కరీమ్ జనత్(20), ముజీబ్ ఉర్ రెహ్మాన్(21) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లు లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ విసిరిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఆఫ్ఘన్ జట్టు మూడు వికెట్లు కోల్పోయింది. ఆ ఓవర్లో నూర్ అహ్మద్ (1) కోహ్లీకి క్యాచ్ ఇచ్చి అవుట్ కాగా, ముజీబ్ ఉర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూఖీ(0) రనౌటయ్యారు. టీమిండియా బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్‌కు మూడు, రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్‌కు రెండేసి, శివం దూబేకు ఒక వికెట్ దక్కాయి. ఈ గెలుపుతో మూడు టి20ల సిరీస్‌ను టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకోగా.. మూడో, చివరి టి20 17న బెంగళూరు వేదికగా జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్‌కు లభించింది.

రోహిత్ శర్మ ఖాతాలో మరో ఘనత

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఖాతాలో మరో ఘనత చేరింది. ఆఫ్ఘనిస్థాన్‌తో రెండో టి20 మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో 150వ అంతర్జాతీయ టి20 మ్యాచ్. పురుషుల అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 150మ్యాచ్ మైలురాయిని చేరుకున్న మొట్టమొదటి క్రికెటర్ రోహిత్ శర్మే.

స్కోర్‌బోర్డు..

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)దూబే (బి)బిష్ణోయ్ 14, జద్రాన్ (బి)అక్షర్ 8, గులాబుద్దిన్ (సి)రోహిత్ (బి)అక్షర్ 57, అజ్మతుల్లా (బి)దూబే 2, మహ్మద్ నబి (సి)రింకు (బి)బిష్ణోయ్ 14, జద్రాన్ (సి)అర్ష్‌దీప్ 23, కరీమ్ జన్నత్ (సి)అక్షర్ (బి)అర్ష్‌దీప్ 20, ముజీబ్ (రనౌట్) జితేశ్ /అర్ష్‌దీప్ 21, నూర్ అహ్మద్ (సి)కోహ్లి (బి)అర్ష్‌దీప్ 1, నవీన్ (నాటౌట్) 1, ఫారూఖీ (రనౌట్)జైస్వాల్ 0, అదనం 11. (20 ఓవర్లలో ఆలౌట్) 172పరుగులు.

వికెట్ల పతనం: 1/20, 2/53, 3/60, 4/61, 5/104, 6/134, 7/164, 8/170, 9/171, 10/172 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-32-3, ముఖేష్ కుమార్ 2-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-39-2, అక్షర్ 4-0-17-2, దూబే 3-0-36-1, సుందర్ 3-0-23-0

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)గుర్బాజ్ (బి)కరీమ్ 68, రోహిత్ శర్మ (సి)ఫారూఖీ 0, కోహ్లి (సి)ఇబ్రహీం (బి)నవీన్ 29, దూబే (నాటౌట్) 63, జితేశ్ శర్మ (సి)నబి (బి)కరీమ్ 0, రింకు సింగ్ (నాటౌట్) 9, అదనం 4. (15.4ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 173పరుగులు. **వికెట్ల పతనం:** 1/5, 2/62, 3/154, 4/156 **బౌలింగ్:** ఫారూఖీ 3.4-0-28-1, ముజీబ్ 2-0-32-0, నవీన్ 3-0-33-1, నూర్ అహ్మద్ 3-0-35-0, నబీ 2-0-30-0, కరీమ్ 2-0-13-2.

న్యూజిలాండ్‌లో భారత్ గెలుపు

ఒలింపిక్స్ ఆశలు సజీవం

రాయ్‌పూర్ : ఒలింపిక్ క్వాలిఫయిర్స్‌లో భాగంగా పూల్-బిలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు 3-1 గోల్స్‌తో విజయం సాధించింది. ఈ విజయంతో ఈ ఏడాది పారిస్ ఒలింపిక్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆదివారం మ్యాచ్‌లో భారత్ మహిళలు ఆరంభం నుంచి దూకుడు ఆటను ప్రదర్శించారు. దీంతో కేవలంలో ఆట ప్రారంభమైన 47 సెకన్లలోనే భారత్ తొలి గోల్ సాధించింది. సంగీత కుమారి భారత్‌కు గోల్ అదించింది. అయితే ఈ తరువాత న్యూజిలాండ్ క్రీడాకారిణి 9వ నిమిషంలో గోల్ సాధించింది. దీంతో ఇరు జట్ల స్కోర్లు 1-1తో సమమయ్యాయి. అయితే మళ్లీ 12వ నిమిషంలోనే భారత్‌కు చెందిన ఉదిత గోల్ సాధించింది. భారత్ స్కోరు 2-1తో అధిక్యం సంపాదించింది. తరువాత మళ్లీ రెండు నిమిషాల్లోనే అంటే 14వ నిమిషంలో డుంగ్ డుంగ్ భారత్‌కు మరో గోల్ సాధించింది. దీంతో భారత్ అధిక్యం 3-1కు చేరుకుంది. ఈ తరువాత ఇరు జట్లు హోరాహోరీ శ్రమించినా మ్యాచ్‌లో మరొక గోల్ నమోదు కాలేదు. దీంతో భారత్ 3-1తో విజయం సాధించింది. శనివారం అమెరికా చేతిలో భారత్ ఓటమి చవిచూసింది. భారత్ చివరి మ్యాచ్ మంగళవారం ఇటలీతో తలపడుతుంది.

రన్నరప్ సాత్విక్-చిరాగ్

ఫైనల్లో టాప్‌సీడ్ చేతిలో పరాజయం



కౌలాంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000 పురుషుల డబుల్స్ రన్నరప్‌గా భారత జోడీ నిలిచింది. ఆదివారం జరిగిన మూడుసెట్ల హోరాహోరీ ఫైనల్లో భారతజోడీ టాప్‌సీడ్, చైనా జంట చేతిలో ఓటమిపాలైంది. ప్రపంచ రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తుదిపోరులో తడబడ్డారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత జంట 21-9, 18-21 17-21 తేడాతో చైనాకు చెందిన వరల్డ్ నెంబర్ వన్ జోడీ వాంగ్-లియాంగ్ చేతిలో ఓటమి పాలయ్యారు. తద్వారా భారత ద్వయం రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 58 నిమిషాలపాటు సాగిన పోరులో తొలి సెట్ గెలిచినా తర్వాత రెండు సెట్లలో ఓడటంతో భారత ద్వయానికి పరాభవం తప్పలేదు. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన భారత ధ్వయం రెండో గేమ్‌లోనూ పోరాడారు. ఓ దశలో 18-19పాయింట్లతో చేరువైనా.. వరుసగా రెండు పాయింట్లు చేజార్చుకొని ఆ గేమ్‌ను కోల్పోయారు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 11-6తో ఆధిక్యలో నిలిచినా... చివర్లో ఒత్తిడి గురై వరుసగా పాయింట్లను చేజార్చుకొని ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68